PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu


సంపుటి : 42 సంచిక : 190 | విజయవాడ, శనివారం 11 ఫిబ్రవరి 2023 | 8+8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 11 February 2023 | Rs



రోహిత్ రికార్డు శతకం

- అక్షర్ పటేల్, జడేజా అర్ధసెంచరీలు
- ఆస్ట్రేలియాపై 144 పరుగుల ఆధిక్యత



నింగిలోకి ఎస్ఎస్ఎల్వి-డి2

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

శ్రీహరికోట నుంచి ఎస్ఎస్ఎల్వి-డి2 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ప్రయోగంలో రెండు దేశీయ ఉపగ్రహాలు, అమెరికాకు చెందిన ఒక ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి మోసుకెళ్లింది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ శుక్రవారం ఉదయం 9.18 గంటలకు నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ 34 మీటర్లు పొడవు, రెండు మీటర్లు వెడల్పు, 119 టన్నుల బరువు కలిగి ఉంది. దీనిని నాలుగు దశల్లో శాస్త్రవేత్తలు ప్రయోగించారు. మొదటి దశను 87 టన్నుల ఘన ఇంధనాన్ని ఉపయోగించి 124 సెకన్లలో, రెండో దశను 7.7 టన్నుల ఘన ఇంధనంతో 384.2 సెకన్లలో, మూడో దశను 4.5 టన్నుల ఘన ఇంధనంతో 674.9 సెకన్లలో, నాలుగో దశలో 0.05 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 7851 సెకన్లలో పూర్తి చేశారు. ఈ చిన్న రాకెట్‌లో 156.3 కిలోల బరువున్న మూడు ఉపగ్రహాలను పంపారు. ఇందులో ఒకటి స్కూల్ విద్యార్థులు రూపొందించినది కావడం విశేషం.శుక్రవారం తెల్లవారుజామున 2.48 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మొత్తం 156.3 కిలోల బరువున్న భూ పరిశీలన ఉపగ్రహం ఇఒఎస్-07, చిన్నారుల సాయంతో స్పేస్ కిడ్జ్ ఇండియా సంస్థ రూపొందించిన 8.7 కిలోల బరువుగల ఆజాదీశాట్-02 ఉపగ్రహం, అమెరికాలోని అంటారిస్ సంస్థకు చెందిన 11.5 కిలోల బరువున్న జానూస్-01 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపారు. ఈ ప్రయోగం విజయవంతంతో అతి తక్కువ ఖర్చుతో అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపే దేశంగా ఇస్రో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఎస్ఎస్ఎల్వి-డి1 పేరుతో గతేడాది ఆగస్టులో తొలి ప్రయోగం విఫలమైన సంగతి తెలిసిందే.



వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

అర్హులందరికీ ఇస్తాం

'వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాది తోఫా'లో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాది తోఫా కార్యక్రమాలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఆ రెండు పథకాల కింద 4,536మంది అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి 38.18 కోట్ల రూపాయలను బటన్ నొక్కడం ద్వారా శుక్రవారం ఆయన జమచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు, నవంబరు ,డిసెంబరు నెలల్లో పెళ్లి చేసుకున్నవారికి ఒక నెల రోజుల పాటు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. అర్హులెవరూ మిస్ కాకూడదనే ఉద్దేశ్యంతో డిసెంబరులో పెళ్లయిన వారికి జనవరి చివరి వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చామని చెప్పారు. వెరిఫికేషన్ పూర్తి చేసి ఇవాళ నేరుగా బటన్ నొక్కి వారికి సహాయం చేసేకార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పెళ్లి చేసుకున్న వారికి ఏప్రిల్ చివరవరకు దరకాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని, వారికి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాన్ని మే నెలలో అందిస్తామని సిఎం తెలిపారు. ప్రతి మూడునెలలకొకసారి మంచే చేసే కార్యక్రమం ఇదేనన్నారు. ఈ కార్యక్రమం కింద లబ్ధి పొందడానికి వయసుతో పాటు చదువును కూడా అర్హతగా నిబంధన విధించామన్నారు. పెళ్ళిళ్ల అయిన వాళ్ల చదువుకున్న వాళ్ల కాబట్టి వాళ్ల తరమే కాకుండా తర్వాత తరం కూడా ఆటోమేటిక్‌గా చదువులు బాట పట్టించే గొప్ప సాంప్రదాయానికి నాందిపలికినట్లు సిఎం వెల్లడించారు. వివాహ వయస్సు అమ్మాయిలకు 18, పురుషులకు 21 సంవత్సరాలుగా నిర్ణయించామని, పదోతరగతి పాస్ అయిఉండాలన్న నిబంధనను పెట్టామని చెప్పారు. పదోతరగతి చదివిన తర్వాత పెళ్లికి కనీస వయస్సు 18 సంవత్సరాలు కాబట్టి, చదువు ఆగిపోకుండా ఇంటర్మీడియట్ చదువుతారని, ఎలాగూ అమ్మఒడి పథకంవీరికి వర్తిస్తుందని, పిల్లలను బడికి పంపిస్తే జగనన్న తోడుగా ఉంటాడనే భరోసా కలుగుతుందని సిఎం వెల్లడించారు విద్యతోనే పేదవాని బతుకుల్లో మార్పు వస్తుందని చెప్పారు. పేదవాళ్ల చదువులు మీద పెట్టే ప్రతిరూపాయిని, ఖర్చు కింద భావించడం లేదని, విద్య అనేది పిల్లలకిచ్చే ఆస్తి కింద తాము భావిస్తున్నామన్నారు. దీనివల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలతో పాటు భవన నిర్మాణ కార్మికుల్లో ఆడపిల్లలున్న కుటుంబాలకు మంచి జరుగుతుంద న్నారు. గత ప్రభుత్వంలో ఎస్‌సిలకు రూ.40వేలు, ఎస్‌టిలకు రూ.50వేలు ప్రకటించి అవి కూడా ఎగరగొట్టిన అధ్వాన పరిస్థితులు ఉన్నాయనానరు. నేడు వారికి సహాయాన్ని లక్ష వరకు పెంచామన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు కులాంతర వివాహం చేసుకుంటే గతంలో రూ75వేలు ఇస్తామని ప్రకటనలకే పరిమిత మయ్యారన్నారు. గతంలో బిసిలకు మిగతా 2లో

మదుపర్లకు రక్షణ ఎలా?



'అదాని' కేసులో కేంద్రానికి సుప్రీం ప్రశ్న

నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచన

13వ తేదీకి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : అదాని అక్రమాలకు హిండెన్‌బర్గ్ వెలుగులోకి తీసుకువచ్చిన తరువాత స్టాక్ మార్కెట్లు దారుణంగా పతనమైన నేపథ్యంలో భవిష్యత్తులో సాధారణ మదుపర్లకు రక్షణ ఎలా కల్పిస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మదుపర్ల ప్రయోజనాలు కాపాడే అంశంపై కేంద్ర ప్రభుత్వంతో పాటు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) కూడా స్పందించాలని కోరింది. నియంత్రణా వ్యవస్థను బలోపేతం చేయడంపై సలహాలు ఇచ్చేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ప్రతిపాదించింది. ఈ విషయాలపై అభిప్రాయాలను తెలియచేయడానికి వీలుగా విచారణను 13వ తేదికి వాయిదా వేసింది. అదాని గ్రూపు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతోందని హిండెన్స్‌బర్గ్ ఒక నివేదికను విడుదల చేసిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూపు కంపెనీల షేర్ల ధరలను ప్రభావితం చేయడం ద్వారా స్టాక్ మార్కెట్‌లో ప్రకంపనలు సృష్టించిన ఈ నివేదికపై దర్యాప్తు చేయాలని కోరుతూ రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం ఈ అంశాన్ని విచారణకు చేపట్టిన వెంటనే, జస్టిస్ చంద్రచూడ్ బెంచ్‌లోని తన సహచర న్యాయమూర్తులతో ఐదు నిముషాల పాటు చర్చించారు. ఆ తర్వాత సెబి తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఉద్దేశించి మాట్లాడారు. "ఇది ప్రారంభ చర్చ మాత్రమే, వారు కోర్టు ముందుకు ఒక విషయాన్ని తీసుకువచ్చారు. భారత మదుపర్ల ప్రయోజనాలను ఏ విధంగా కాపాడగలమన్నదే ఇక్కడ ఆందోళన కలిగించే అంశంగా వుంది. ఇక్కడ షార్ట్ సెల్లింగ్ జరిగింది. బహుశా సెబి కూడా దీనిపై దర్యాప్తు చేస్తూ వుండొచ్చు. ఈ షార్ట్ సెల్లింగ్ చిన్న స్థాయిలోనే జరిగివుంటే ఎవరికీ బాధ వుండదు, కానీ ఇది పెద్ద స్థాయిలో జరిగింది. కొన్ని వర్గాల వార్తల ప్రకారం, భారతమదుపర్లకు అనేక లక్షల కోట్ల రూపాయిల నష్టం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో భారత ఇన్వెసర్ల ప్రయోజనాలను మనం ఎలా కాపాడాలి? . భవిష్యత్తులో మరోసారి ఇలాంటిది జరగబోదని ఎలా హామీ ఇస్తాం? దీనిలో సెబి పాత్రఏమిటి?' అని చంద్రచూడ్ ప్రశ్నించారు. ఈ పరిస్థితుల పరిష్కారానికి ముందుగా ఒక కమిటీని వేయాలని ఆయన సూచించారు. తమ సూచనకు కేంద్రం సుముఖంగా వుంటే వెంటనే అందుకు అవసరమైన సమాచారంతో కోర్టుకు హాజరు కావాలని కోరారు. 'సెబీ మీద లేదా ఇతర నియంత్రణా వ్యవస్థలపైనా సందేహాలు వ్యక్తం చేయాలని అనుకోవడం లేదు. కానీ మరింత విస్తృతంగా మేథోమథనం జరగాలన్నదే మా ఉద్దేశ్యం' అని చెప్పారు. . ప్రస్తుతమున్న వ్యవస్థను ఎలా బలోపేతం చేయగలమో చర్యలను సూచిస్తూ సోమవారానికి రావాలని కోరారు. దానిపై సొలిసిటర్ జనరల్ స్పందిస్తూ, పరిస్థితులను సెబీ నిశితంగా గమనిస్తోందని చెప్పారు.

అదానికి మూడిస్ షాక్

మరోవైపు అదాని కంపెనీలకు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడిస్ భారీ షాక్ ఇచ్చింది. అదానికి చెందిన నాలుగు కంపెనీలకు రేటింగ్‌ను స్టెబుల్ (స్థిరత్వం) నుంచి నెగిటివ్ (ప్రతికూల)కు మార్చినట్లు మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ శుక్రవారం వెల్లడించింది. అదాని గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, అదానీ గ్రీన్ ఎనర్జీ రిస్ట్రిక్టెడ్ గ్రూపు, అదానీ ట్రాన్స్‌మిషన్ స్టెప్‌వన్ లిమిటెడ్, అదానీ ఎలక్ట్రిసిటీ ముంబయి లిమిటెడ్ సంస్థలకు ఇచ్చిన రేటింగ్ ఔట్‌లుక్‌ను స్టేబుల్ నుంచి నెగెటివ్‌కు మార్చింది. ఇంతకుముందు క్రెడిట్ సూయిజ్, సిటీ బ్యాంక్ సంస్థలు కూడా అదాని గ్రూప్ సంస్థలు జారీ చేసిన బాండ్లకు విలువ లేదని.. వాటిని తనఖా పెట్టుకుని రుణాలు ఇవ్వకూడదని నిర్ణయించిన విషయం తెలిసిందే. మరోవైపు అదాని కంపెనీల షేర్లను మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇంటర్నేషనల్ (ఎంఎస్‌సిఐ) వెయిటేజీని పున:సమీక్షించింది. నాలుగు అదానీ కంపెనీల మిగతా 7లో

త్రిపురలో బిజెపి అధికార దుర్వినియోగం

జంతర్ మంతర్ వద్ద సిపిఎం ఆందోళన



ఆందోళన చేస్తున్న ప్రకాశ్ కరత్ తదితరులు

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడానికి బిజెపి డబ్బు, అధికారాన్ని పెద్దయెత్తున దుర్వినియోగం చేస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ విమర్శించారు. బిజెపి అధికార దుర్వినియోగాన్ని ఆపాలని, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఆ పార్టీ ఢిల్లీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలోనే రాష్ట్రంలో ప్రజాస్వామ్య సంస్థలను నాశనం చేసిందని విమర్శించారు.

త్రిపురలో రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకంగా మారాయ న్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్నికల నూ బిజెపి పూర్తిగా తొత్తడం చేసిందని అన్నారు. వామపక్ష కార్యకర్తలపై హింసాత్మక దాడులకు అడ్డు అదుపు లేకుండా పోతోందని, ఇప్పటి వరకు 667 పార్టీ కార్యాలయాలు, 3,363 ఇళ్లు ధ్వంసం చేశారని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న వామపక్ష కార్యకర్తలపై కూడా బిజెపి దాడులు చేస్తోందని, ఈ పరిస్థితిలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయా అన్న అనుమానం అందరిలోనూ తలెత్తుతోందని అన్నారు. ఎన్నికల కమిషన్ తనకున్న అధికారాన్ని వినియోగించుకుని ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసే పరిస్థితులు కల్పించాలని కరత్ కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు హన్నన్ మొల్లా, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారీ, డివైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమగ్నరాజ్ భట్టాచార్య తదితరులు మాట్లాడారు.

శ్రీశ్రీ కవిత్వం అజరామరం

- ప్రముఖ రచయిత రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
- 'శ్రీశ్రీ జయభేరి' పుస్తకావిష్కరణ

లోపలి పేజీలో..

బిబిసిని నిషేధించాలా?

- హిందూసేనకు తలంటిన సుప్రీం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీపై రెండు డాక్యుమెంటరీలను తీసిన నేపథ్యంలో బిబిసి కార్యకలాపాలను భారత్‌లో నిలిపేయాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం నాడు కొట్టిపారేసింది. హిందూసేన అధ్యక్షుడు విష్ణు గుప్తా దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను 'తప్పుడు పిటిషన్'గా పేర్కొంది. భారత వ్యతిరేక కథనాలు ప్రసారం చేస్తున్న బిబిసి కార్యకలాపాలను దేశంలో నిలుపుదల చేసి, దాని ఉద్యోగులపై దర్యాప్తు చేపట్టాల్సిందిగా ఆదేశాలివ్వాలని హిందూసేన కోరింది. ఈ పిటిషన్‌పై విస్మయం వ్యక్తం చేసిన జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన ధర్మాసనం 'దీనిని తప్పుడు పిటిషన్'గా భావిస్తున్నామని హిందూసేనకు తలంటారు. దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది పింకీ ఆనంద్ మాట్లాడుతూ 'బ్రిటన్ ప్రధానిగా భారతీయ వ్యక్తి ఉన్నారు. భారత్ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న సమయంలో మనమున్నాం. ఈ సమయంలో భారత్ వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతున్నారు' అని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. దీనిపై జస్టిస్ సంజయ్ ఖన్నా తీవ్రంగా స్పందిస్తూ 'ఇదేం వాదన? ఇప్పుడు మమ్మల్ని పూర్తిగా సెన్సార్ విధించాలని కోరుతున్నారా' అని నిలదీశారు.

రాజధాని, ప్రత్యేక హోదా, విభజన హామీలపై

బిజెపిది పచ్చి అవకాశవాదం

- బడ్జెట్‌పై 22 నుండి 28 వరకు నిరసనలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని, ప్రత్యేక హెూదా, విభజన హామీల విషయంలో బిజెపి రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్రంలోను, కేంద్రంలోనూ బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 22 నుంచి 28వ తేది వరకు పెద్దఎత్తున ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడ బాలోత్సవభవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. రాజధానిపై కోర్టులో కేసుందనే పేరుతో కేంద్రం కప్పదాటు ధోరణి అనుసరించిందని విమర్శించారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించిందే తప్ప చిత్తశుద్ధి కనిపించడం లేదని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధానిని మార్చడం సరికాదని అన్నారు. విద్యార్థి, యువజన సంఘాలు బస్సు యాత్ర నిర్వహించిన తరువాత ప్రత్యేక హెూదాపై మరలా చర్చ ప్రారంభమైందని, రాష్ట్ర హక్కులను సాధించేంతవరకు పోరాటం సాగించాలని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపిలు దీనిపై నోరెత్తడం లేదన్నారు. ప్రజావ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని ఆయన రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఇది కోతల బడ్జెట్ అని అన్నారు. వ్యవసాయం, సంక్షేమం, ఉపాధిపై కోత విధించారని, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను రద్దు చేశారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరిగి 10.8 శాతానికి చేరుకుందని తెలిపారు. అన్ని వ్యవస్థల మీద దాడి చేస్తున్న కేంద్రం న్యాయ వ్యవస్థ మీద కూడా దృష్టి పెట్టిందని తెలిపారు. దీన్ని ప్రశ్నించాల్సిన పార్టీలు కొన్ని అవకాశవాదంగా వ్యవహరిస్తూ న్యాయవ్యవస్థపై నిందలు మోపే చర్యలకు దిగాయని, మన రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కూడా అదే చేస్తోందని తెలిపారు. ఇది న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సహకార రంగాన్ని కేంద్ర పరిధిలోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారని, యూనివర్సిటీల మీద ఆధిపత్యం చలాయించేందుకు ఆర్ఎస్ఎస్ వ్యక్తులను విసిలుగా మిగతా 2లో

డయాఫ్రం వాల్ పూర్తయ్యాక పనులు వేగవంతం : అంబటి



పోలవరం ప్రాజెక్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)

డయాఫ్రంవాల్ స్థితిగతుల అంచనా పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రాజెక్టుకు సంబంధించి లోయర్ కాపర్ డ్యామ్, డయాఫ్రం వాల్, జెట్ గ్రౌండింగ్, గైడ్ బండ్ పనులను పరిశీలించి సిఇ సుధాకర్‌బాబు, ఎస్ఇ నరసింహమూర్తిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో జల వనరుల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే పోలవరం ప్రాజెక్టు జాప్యానికి కారణమని విమర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రధానమైన ఎర్త్ కంరాక్‌ఫిల్ డ్యాం నిర్మాణానికి డయాఫ్రం వాల్ పెద్ద సమస్యగా మారిందన్నారు. డయాఫ్రంవాల్ ఎంత మేర దెబ్బతింది, మరమ్మతులు చేయడమా? లేక కొత్తది నిర్మించాలా? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. గత నెలలో నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ అధికారులు ప్రారంభించిన పరీక్షల వివరాలు, నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ అధికారులు, నిపుణుల పరీక్షల నివేదికలు వచ్చేవరకూ పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని తెలిపారు. కర్ణాటకలో చేపడుతున్న అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌ను వైసిపి ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని తెలిపారు. తుంగభద్ర నది ఎగువన నిర్మిస్తోన్న ఈ ప్రాజెక్ట్ వల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్ ద్వారా రాష్ట్రానికి వచ్చే కృష్ణా నది సాగుజలాల కేటాయింపులో మన రాష్ట్రానికి ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌పిసి బృంద సభ్యులు విపుల్, ఎన్‌కె.పాండే, ఎంపి సింగ్, మేఘా సంస్థ ఇంజినీర్ అనంత్‌ను మంత్రి సత్కరించారు.

వివేకా హత్య కేసు నిందితులు చంచల్‌గూడ జైలుకు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించాలని హైదరాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు విచారణ ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ అయిన తర్వాత శుక్రవారం సిబిఐ కోర్టులో తొలిసారి విచారణ జరిగింది. వివేకా హత్య కేసుకు సిబిఐ కోర్టు ఎస్‌సి/01/2023 నంబర్ కేటాయించింది. కడప కారాగారంలో అండర్ ట్రైల్ ఖైదీలుగా ఉన్న నిందితులు సునీల్ యాదవ్, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఉమా శంకర్‌రెడ్డిలను ప్రత్యేక భద్రత నడుమ పోలీసులు సిబిఐ కోర్టులో ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి సిహెచ్.రమేష్‌బాబు ఎదుట హాజరు పర్చారు. బెయిల్‌పై ఉన్న నిందితులు ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరి కూడా కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణను వచ్చే నెల 10వ తేదీకి వాయిదా పడింది. న్యాయమూర్తి ఆదేశాల ప్రకారం సునీల్ యాదవ్, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఉమా శంకర్‌రెడ్డిలను పోలీసులు ఎస్కార్ట్ నడుమ చంచల్‌గూడ జైలుకు తరలించారు.

కమిటీలతో కాలయాపన

- ఆయిల్ కంపెనీలో ప్రమాదంతో కార్మికుల్లో కలవరం
- పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కరువు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ప్రమాదం జరిగిన జి.రాగంపేటలో అంబటి సుబ్బయ్య అండ్ కో ఆయిల్ ఫ్యాక్టరీ (ఫైల్)

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ రూరల్‌లోని ట్రైకీ పరిశ్రమలో 2021 మార్చి 11న రియాక్టర్ పేలడంతో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. 2022 ఆగస్టు 19న ప్యారి షుగర్ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే పరిశ్రమలో పది రోజుల వ్యవధిలో 2022 ఆగస్టు 29న టన్ను బరువు ఉన్న యాంగిలర్ పడి మరో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. ఈ ప్రమాదాల సంబంధించి అధికారులతో విచారణ కమిటీలు వేశారు. అయితే నేటికీ ఆ కమిటీల నివేదికలుగానీ, తీసుకున్న చర్యలుగానీ బహిర్గతం చేయలేదు. తాజాగా అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ కంపెనీకి చెందిన పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని ఆయిల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఏకంగా ఏడుగురు బలయ్యారు. దీనిపైనా కమిటీ వేశారు. ఈసారైనా నివేదికను బహిర్గతం చేస్తారా? లేక షరా మామూలుగానే వదిలేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సూక్ష్మ, చిన్న తరహా, మధ్యతరహా, భారీ పరిశ్రమలు మొత్తంగా ఎనిమిది వేలకుపైగా ఉన్నాయి. వీటిల్లో దాదాపుగా 1.40 లక్షల మంది పని చేస్తున్నారు. అధికారుల సమాచారం మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 172 ప్రమాదకర ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిల్లో 22 అత్యంత ప్రమాదకర పరిశ్రమలు. ఈ నేపథ్యంలో ఆయా పరిశ్రమలు కార్మికుల భద్రతపై పక్కాగా తగిన ప్రమాణాలు పాటించాల్సి ఉంది. యాజమాన్యాలు కార్మికుల భద్రతను, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయి. కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడం, యాజమాన్యాలకు అనుకూలంగా మార్చడంతో అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో, యాజమాన్యాలు కార్మిక భద్రతను పూర్తిగా గాలికొదిలేస్తున్నాయి.

ఈ నివేదికైనా బయట పెట్టేనా?

పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని అంబటి సుబ్బన్న ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం తర్వాత పరిశ్రమల శాఖ, కార్మిక, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక శాఖల అధికారులతో కమిటీని కలెక్టర్ కత్తికా శుక్ల గురువారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీ రెండు, మూడు రోజుల్లో నివేదిక ఇవ్వనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు పరిశ్రమ బయట గేటుకు సీల్ వేశారు. ప్యాకింగ్ కోసం చేరిన కార్మికులకు ట్యాంకు క్లీనింగ్‌ను అప్పగించడం, కనీసం భద్రత కల్పించకపోవడం, ఏడుగురు చనిపోయినా యాజమాన్యం స్పందించకపోవడం వంటి వాటిపై మిగతా 2లో

ఆరేళ్ల బాలికపై అత్యాచారయత్నం

- ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)
కడప జిల్లా ప్రొద్దుటూరులో దారుణం చోటు చేసుకుంది. పట్టణంలోని మోడంపల్లె పరిధిలోని ఓ కాలనీలో బాలిక అత్యాచారయత్నానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలికను ఇంటి వెనుకకు తీసుకెళ్లి అదే ప్రాంతానికి చెందిన కొత్తపల్లె శ్రవణ్ (21), మంగపట్నం రాము (20) అత్యాచారం చేయబోతుండగా స్థానికులు గమనించడంతో వారిద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరి యువకులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది.

ముగిసిన హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్
యువగళం పాదయాత్రలో విధుల నిర్వహిస్తూ గుండెనొప్పితో మరణించిన కానిస్టేబుల్ రమేష్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం చిత్తూరు జిల్లా యాదమరి మండలం కూచుంపల్లెలో పోలీసుల లాంఛనాలతో శుక్రవారం ముగిశాయి. చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి నివాళులర్పించి తక్షణ సాయం (క్రిమేషన్ ఫండ్) కింద రూ.25 వేలను మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్మ్డ్ రిజర్వు పోలీసుల గార్డ్ ఆఫ్ హానర్ నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

రమేష్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం
రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ ప్రయోజనాల్లో భాగంగా రూ. 50 లక్షలు, మృతుడి కుటుంబంలో ఒకరికి త్వరితగతిన ఉద్యోగం ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్‌పి రిషాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రటనలో పేర్కొన్నారు.

హమారా ప్రసాద్‌ను అరెస్టు చేయాలి

- కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచితంగా, అహంకారంగా మాట్లాడిన హమారా ప్రసాద్‌ను ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఇటువంటి కులదురహంకార వ్యాఖ్యలు మరొకరు మాట్లాడకుండా శిక్షించాలన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అంబేద్కర్ బతికి ఉంటే గాంధీని గాడ్సే కాల్చేసినట్లే తాను కూడా అంబేద్కర్‌ను కాల్చి చంపేవాడినని బహిరంగంగా ప్రకటించడాన్ని ఉపేక్షించరాదన్నారు. ఇది జాతికి జరిగిన అవమానంగా పరిగణించి ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని, జాతీయ నాయకులను కించపరిచే వారిని కఠినంగా శిక్షించాలని నల్లప్ప, మాల్యాద్రి డిమాండ్ చేశారు.

'డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించకపోతే దరువుతో తిరగబడతాం'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలోని వివిధ రకాల పెన్షన్లను ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతున్న ప్రభుత్వం ఆదిమ కళగా ఉన్న డప్పు కళాకారులను విస్మరించిందని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి క్రాంతి కుమార్ విమర్శించారు. సంఘం రాష్ట్ర సమావేశం విజయవాడలోని ఎంబివికెలో శుక్రవారం జరిగింది. నాయకులు డి ఆనందబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. 2013లో పోరాడి డప్పు కళకు గుర్తింపు సాధించుకున్నామని తెలిపారు. 2019లో రూ.3000 పెన్షన్ ఇచ్చారని, కానీ అన్ని పెన్షన్ల మాదిరి పెంచడం లేదని అన్నారు. కళాకారులు, చర్మకారులందరికీ నెలకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిజిటల్ సర్టిఫికెట్ల పేరుతో సచివాలయాల్లో వస్తున్న ఆటంకాలను తగ్గించి, స్వీయ ధ్రువీకరణ పత్రం ద్వారానే పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుటుంబరావు, క్రాంతిబాబు, రంగమ్మ, చిరంజీవి, విజయ్, విజయమ్మ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


అర్హులందరికీ ఇస్తాం

(మొదటి పేజీ తరువాయి)
రూ.75వేలు ఇస్తామని ప్రకటిస్తే ఆ మొత్తాన్ని నేడు తమ ప్రభుత్వం రూ.1.20లక్షలకు పెంచి అమలు చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికులకు గత ప్రభుత్వం రూ.20వేలు ప్రకటిస్తే. నేడు రూ.40వేలకు పెంచామన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ నాడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎడ్యుకేషన్ ఈజ్ ద వెపన్ అన్న మాట నేడు తమ ప్రభుత్వం అమలు చేస్తుండటంతో, డ్రాప్ అవుట్స్ తగ్గారన్నారు.

ఇటీవల మైసూరులో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో 9 రాష్ట్రాలు పాల్గొన్న సమావేశంలో ఒక్క ఎపిలోనే డ్రాప్ అవుట్స్ తగ్గారని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమం, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బి.జయలక్ష్మీ, మైనార్టీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎఎండి ఇంతియాజ్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ కె.హర్షవర్ధన్, మైనార్టీ సంక్షేమశాఖ డైరెక్టర్ జిసి కిషోర్ కుమార్, వైఎస్ఆర్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండి ఎస్‌షన్‌మోహన్ పాల్గొన్నారు.

శ్రీశ్రీ కవిత్వం అజరామరం

- ప్రముఖ రచయిత రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
- 'శ్రీశ్రీ జయభేరి' పుస్తకావిష్కరణ


'శ్రీశ్రీ జయభేరి' ఆవిష్కరణలో రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, తెలకపల్లి రవి, ఎస్.వెంకట్రావు, కె.లక్ష్మయ్య తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్
తెలుగుజాతి, అభ్యుదయ భావజాలం ఉన్నంతవరకు శ్రీశ్రీ కవిత్వం ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న విజయవాడ పుస్తక మహోత్సవంలో శనివారం ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 'శ్రీశ్రీ జయభేరి' పుస్తకావిష్కరణ జరిగింది. ప్రముఖ రచయిత, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి రచించిన ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఎస్.వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో రాచపాళెం మాట్లాడారు. కవులకు శ్రీశ్రీ మార్గదర్శకులని అన్నారు. శ్రీశ్రీ జయభేరి పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉందని వివరించారు. శ్రీశ్రీ సాహిత్యాన్ని పుస్తకాల రూపంలో అందిస్తున్న అతి కొద్ది మంది రచయితల్లో తెలకపల్లి రవి ఒకరని తెలిపారు. పుస్తక రచయిత, సామాజిక విశ్లేషకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ.. శ్రీశ్రీకి అందరూ వీరాభిమానులేనన్నారు. ఆయన రచనలు సమాజానికి దగ్గరగా ఉంటాయని, ప్రజల్లో విజ్ఞానాన్ని, వికాసాన్ని పెంపొందించేవిగా ఉంటాయని తెలిపారు. శ్రీశ్రీ కవితలో ప్రతి అక్షరం అర్థవంతంగా ఉంటుందన్నారు. శ్రీశ్రీ పదజాలం గొప్పగా ఉంటుందని, ఆయన భాష గొప్తశక్తితో కొత్త అర్థం ఇచ్చేవిధంగా ఉంటాయని తెలిపారు. తెలుగు భాషను, తెలుగువారి చైతన్య స్థాయి, పోరాటశక్తిని ముందుకు నడిపించిన వ్యక్తి అని కొనియాడారు. అందుకే ఆయన మహాకవి అయ్యారని పేర్కొన్నారు. శ్రీశ్రీ కవిత్వాన్ని, సాహిత్యాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. శ్రీశ్రీ సాహిత్య నిధి అధినేత సింతగంపల్లి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో ఏకైక మహాకావ్యం శ్రీశ్రీ ప్రస్థానం అన్నారు. ఎస్.వెంకట్రావు అధ్యక్షోపన్యాసం చేస్తూ 2010లో ఆవిష్కరణ జరిగిన "శ్రీశ్రీ జయభేరి' కొద్ది మార్పులతో 13 ఏళ్ల తర్వాత 6వ ముద్రణగా పుస్తకావిష్కరణ చేసినట్లు తెలిపారు. పేదల, శ్రామికవర్గం కోసం, రచనలు చేసిన మహావ్యక్తి శ్రీశ్రీ అని కొనియాడారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 21న రెడ్‌బుక్ డే నిర్వహిస్తున్నారని, ఈసారి శ్రీశ్రీ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని నిర్ణయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య, పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా ప్రముఖ స్త్రీవాద కవయిత్రి ఓల్గా ముఖాముఖి కార్యక్రమం జరిగింది.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి విశ్వరూప్‌నకు ఎమ్మెల్సీ సాబ్జీ వినతి


మంత్రి విశ్వరూప్‌నకు వినతి పత్రం అందజేస్తున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - అమలాపురం(డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా)
ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శుక్రవారం రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. డిపోల్లో క్రమశిక్షణ చర్యల పేరుతో అధికారుల వేధింపులను, కార్మికుల తొలగింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఏలూరు డిపోలో అవసరం లేని కేసుల్లో కూడా సస్పెన్షన్లు చేసి సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. ఆ కేసులను సమీక్షించి నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఆర్‌టిసి సంస్థ నష్టాలు అన్నీ తీరిన తరువాతనే ప్రభుత్వ ఖజానాకు కొంత మొత్తాన్ని చెల్లించాలని 2019 ఎపిఎస్‌ఆర్‌టిసి చట్టంలో స్పష్టంగా నిర్దేశించారని ఆయన గుర్తు చేశారు. దీన్ని ఉల్లంఘించి ప్రతి నెలా రూ.125 కోట్లను జమ చేస్తున్నారన్నారు. ఉద్యోగులకు సంబంధించిన అన్ని రకాల బకాయిలను కొంత కాల పరిమితితో చెల్లించాలని ఆ చట్టంలో పేర్కొన్నారని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆ నిధులను పూర్తిగా ఆర్‌టిసి అవసరాలకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల అవసరాల మేరకు అదనపు బస్సులు నడపాలని, వీటి కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఎఫ్ఎంఎస్‌లో ఉన్న ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లను వెంటనే చెల్లించాలని, జనవరి నుంచి సెప్టెంబర్ కాలానికి సంబంధించి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని మంత్రిని కోరారు.

వలసలు తగ్గాలంటే ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి

- మహిళా వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలో పనులు లేక వలసలు పెరుగుతున్నాయని, వాటిని తగ్గించాలంటే ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం వడ్డేశ్వరంలో జరిగిన సంఘ సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ వి శివనాగరాణి మాట్లాడుతూ.. ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ.30 వేలకోట్లు తగ్గించిందని తెలిపారు. ఉపాధి హామీలో 100 రోజుల పనిదినాలకుగానూ 30 నుంచి 40 పనిదినాలు మాత్రమే కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కూలీలు పనుల్లేక గ్రామాల నుంచి ఇతర జిల్లాలకు వలస వెళుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఎటువంటి సౌకర్యాలూ లేక పిల్లల చదువులు కూడా మధ్యలోనే ఆగిపోతున్నాయని వివరించారు. ఉపాధి హామీ పని కల్పించడం ద్వారా వలసలు తగ్గించొచ్చుని, పని అడిగిన అందరికీ 200 రోజులకు పనిదినాలు పెంచి రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికోసం రూ.1.50 లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, వాటిని తగ్గించి వ్యవసాయ కూలీల కొనుగోలు శక్తిని పెంచాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బి కోటేశ్వరి, తామా ముత్యాలమ్మ, మడకం సుధారాణి, కెనీమేరీ, సీత, రమణ తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతులు ఉద్యమించాలి

- ఏప్రిల్ 15న సహకార చక్కెర పరిశ్రమల రాష్ట్ర సదస్సు
- ఆంధ్రప్రదేశ్ చెరకు రైతుల రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
చెరకు రైతులు ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ చెరకు రైతుల రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఏప్రిల్ 15న కో-ఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీల రాష్ట్ర కన్వెన్షన్ జరిపి, ప్రభుత్వం చేపట్టనున్న లిక్విడేట్ ఉపసంహరించుకునేలా ఉద్యమం చేయాలని, మూతపడిన ప్రైవేటు ఫ్యాక్టరీలను తెరిపించాలని లేదా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడపాలని కమిటీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఎపి చెరకు రైతుల రాష్ట్ర కమిటీ సమావేశం వడ్డేశ్వరంలోని కెబి భవన్‌లో సంఘం అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. చెరకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రావు సూర్యనారాయణ ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. వీటితోపాటు చెరకు పరిశోధన కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించి, కొత్త చెరకు వంగడాలను అభివృద్ధిపరచాలని, చిత్తూరులో నేతం, తిరుపతిలో మయూరి, నెల్లూరులో కొవ్వూరు ఫ్యాక్టరీల పరిధిలో చెరకు బకాయిలు సుమారు రూ.60 కోట్లు వెంటనే రైతులకు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం షుగర్ పరిశ్రమ పాలసీని ప్రభుత్వం ప్రకటించి అమలు చేయాలని, స్టేట్ అడ్వైజ్ ప్రైస్‌ను పునరుద్ధరించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. దేశ వ్యాప్తంగా షుగర్ ఉత్పత్తి 3.6 శాతం పెరిగిందని చెరకు రైతుల అఖిల భారత ఫెడరేషన్ అధ్యక్షులు డి రవీంద్రన్ తెలిపారు. 520 ఫ్యాక్టరీల్లో క్రషింగ్ జరిగిందన్నారు. గతేడాది కంటే చెరకు విస్తీర్ణం, ఉత్పత్తి దేశవ్యాప్తంగా పెరిగిందని, కేంద్ర ప్రభుత్వం టన్ను చెరకుకు ఎఫ్ఆర్‌పి రూ.3050గా ప్రకటించిందని, దానిపై స్టేట్ అడ్వైజ్ ప్రైస్ ఉత్తరప్రదేశ్ రూ.650, పంజాబ్ రూ.660, హర్యానా రూ.620 చొప్పున రైతులకు చెల్లిస్తున్నాయన్నారు. కర్ణాటకలో చెరకు కటింగ్, రవాణాకు ఎఫ్ఆర్‌పి మీద రూ.650 చెల్లిస్తుండగా, తమిళనాడులో కేంద్ర ప్రభుత్వం ధరపైన ఎస్ఎపి రూ.200 చెల్లిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చెరకు రైతులు చాలా తక్కువ ధర పొందుతున్నారని, రాష్ట్రం సలహాధర ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటి వరకు రికవరీని పెంచే చెరకు విత్తనాలను రైతులకు ఇవ్వకపోవడంతో రాష్ట్ర సగటు రికవరీ 9.5 శాతానికి మించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎఫ్ఆర్‌పి కూడా రాష్ట్రంలో రైతులు పొందలేకపోతున్నారన్నారు. 6 కో-ఆపరేటివ్ ఫ్యాక్టరీలను లిక్విడేట్ ప్రకటించారని రవీంద్రన్ తెలిపారు. సమావేశం అనంతరం షుగర్‌కేన్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి చెరకు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కమిషనరు చెరకు బకాయిలు చెల్లించడానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు, మూసిన ఫ్యాక్టరీలు తెరిపించడానికి రాష్ట్ర సలహాధర, విధాన పరమైన విషయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ప్రతినిధుల బృందతో చెప్పినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కె ప్రభాకర్‌రెడ్డి, వై కేశవరావు, ఎమ్ హరిబాబు, పి హేమలత, కె జనార్ధన్, శీనయ్య, దశరథరామ్, వెంకటరామయ్య, త్రినాథ, తాతారావు, జివి సుబ్బారావు, బుద్ధుడు, రామాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

నేడు, రేపు 'నాస్తిక మేళా'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
జాతీయ నాస్తిక మేళా 31 సమావేశాలు ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్నట్లు నాస్తిక సమాజం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి బి సుధాకర్ తెలిపారు. గుంటూరు జిల్లా నిడమర్రు గ్రామంలోని చార్వాకాశ్రమంలో ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రజల్ని సాంస్కృతిక ఉద్యమంగా, చైతన్య శక్తిగా నాస్తికత్వం రూపొందిస్తోందని తెలిపారు. అవాస్తవికమైన, మోసపూరితమైన భావజాలం ప్రాతిపదికగా నిర్మితమైన దోపిడీ వ్యవస్థల్ని కూలదోసి, సమతా మానవ సమాజ నిర్మాణం కృషిలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిసోందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని ప్రతిష్టించాలని నేటి పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ, శాస్త్రవిజ్ఞాన ప్రయోగశాలలనూ, చారిత్రక, సామాజిక సంస్థలనూ కాషాయీకరణ చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం భిన్నత్వంలో ఏకత్వాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నిస్తోందని అన్నారు. కుల, మత, ప్రాంతాల ద్వారా ప్రజల్లో చీలికలు తీసుకొచ్చేలా రాజకీయాలను మతోన్మాద పెత్తందారీ వర్గాలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాద ఫాసిస్టు శక్తులు పెచ్చరిల్లుతున్న ఈ సంక్షోభ సమయంలో ప్రగతిశీలవాదులందరూ ఈ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో సామాజిక ఉద్యమకారులు టి లక్ష్మీ నారాయణ, విప్లవ రచయితల సంఘం నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్, జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు వి బ్రహ్మారెడ్డి, ఉయ్యాల సురేందర్ పలు అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు.

రాజీనామా అప్పుడే చేస్తా : కోటంరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
టిడిపిలో గెలిచి వైసిపిలో ఉన్న ఎమ్మెల్యేలు రాజీనామా చేసినప్పుడే తాను రాజీనామా చేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బెదిరింపులకు ఏ మాత్రమూ భయపడనని మరోసారి ప్రకటించారు. చంద్రబాబునాయుడు ట్రాప్‌లో పడలేదని, ప్రజల ట్రాప్‌లో పడ్డానని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం నిర్వహిస్తానని, అందులో ఎలాంటి రాజీ లేదన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ మీటింగ్‌కు పిలిచినా, పిలవకపోయినా తాను, మేయర్ హాజరవుతామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేంద్ర హోంశాఖకు ఉత్తరం రాశానని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉత్తరం రాయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

'వెలిగొండ' మేమే పూర్తిచేస్తాం : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
'ప్రకాశం జిల్లాలోని పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును మేమే పూర్తి చేస్తాం' అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేసేది కూడా టిడిపినే అని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ప్రాజెక్టు నిర్వాసితులు చంద్రబాబును శుక్రవారం కలిశారు. ప్రకాశం జిల్లా కరువు ప్రాంత అవసరాలను గుర్తించి, తానే ప్రాజెక్టును పెట్టానని చంద్రబాబు చెప్పారు. 2004 తరువాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు సాగలేదని, 2014 తరువాత మళ్లీ టిడిపినే పనులు వేగవంతం చేసిందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో మిగిలి ఉన్న 10 శాతం పనులను కూడా జగన్ ప్రభుత్వం చెయ్యలేకపోయిందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత పనులను పూర్తిచేసి ప్రాజెక్టును తానే ప్రారంభిస్తానని అన్నారు. నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజి ఇచ్చి, వారికి అన్ని విధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని జగన్ అన్ని విధాలా నాశనం చేశారన్నారు. సిఆర్‌డిఎకు అప్పులు ఇచ్చిన బ్యాంకులు వసూలు కోసం రావడం రాష్ట్ర దుస్థితికి నిదర్శనమని విమర్శించారు. వైసిపి పాలనలో భూముల ధరలు పడిపోయి, తెలంగాణలో పెరిగాయని పేర్కొన్నారు. రాజధాని విషయంలో లేని అధికారం ఉందని చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. తమకు రూ.18 లక్షలు చొప్పున ఇస్తామని వైసిపి నేతలు ప్రకటించి అమలు చేయడం లేదని నిర్వాసితులు చంద్రబాబుకు వివరించారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్నా పరిహారం ఇవ్వలేదని తెలిపారు.

రాష్ట్రంలో ఆకలి చావులు
రాష్ట్రంలో ఆకలి చావులు చోటుచేసుకుంటున్నాయని ట్విట్టర్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా పెదపద్మాపురంలో పింఛను అందక గిరిజన వృద్ధుడు చనిపోయినట్లు ట్వీట్ చేశారు. సాంకేతిక కారణాల పేరుతో పింఛన్ మంజూరు చేయకపోవడంతో కడుపు నింపుకునే దారి లేక ఆకలితో సవర బారి అనే వృద్ధుడు మరణించినట్లు తెలిపారు.

కొత్తగా అయిదు వైద్య కళాశాలలు : మంత్రి రజిని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
వచ్చే విద్యా సంవత్సరం నుంచి మచిలీపట్నం, ఏలూరు, విజయనగరం, నంద్యాల, రాజమండ్రి ప్రాంతాల్లో కచ్చితంగా వైద్య కళాశాలలు ప్రారంభం కావాలని వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. ఈ ఐదు చోట్ల ప్రత్యేక చొరవ చూపించాలని తెలిపారు. జాతీయ వైద్య మండలి నిబంధనల మేరకు అన్ని వసతులూ వచ్చే నెలాఖరులోపు సమకూర్చుకోవాలని ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కళాశాలలకు అవసరమైన సిబ్బంది నియామకాలు వెంటనే పూర్తిచేయాలని చెప్పారు. ఎన్ఎంసి అనుమతులు వచ్చే వరకు విశ్రమించొద్దని, నిబంధనలకు అనుగుణంగా ప్రతి అంశం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది నియామకాల కోసం అవసరమైతే జాతీయ స్థాయిలో నోటిఫికేషన్ ఇవ్వాలని చెప్పారు. పిజి సీట్లను రాష్ట్రంలో గణనీయంగా పెంచుకునే విషయంలో ప్రభుత్వం విజయం సాధించిందని తెలిపారు. 2019లో 911 సీట్లు ఉంటే, ఇప్పుడు 1249కు పెంచుకోగలిగామని చెప్పారు. ఈ ఏడాది మరో 637 సీట్లు పెంపుదలకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, డిఎంఇ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న ఉక్కు మహిళా ఉద్యోగులు

స్టీల్‌ప్లాంట్‌కు ఉత్తమ ఎంటర్‌ప్రైస్ అవార్డు

- జాతీయ స్థాయిలో కైవశం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)
నవరత్న కంపెనీల్లో ప్రతిష్టాత్మక ఉత్తమ ఎంటర్‌ప్రైస్ అవార్డుల్లో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో మహిళల అభివృద్ధికి స్టీల్‌ప్లాంట్ తీసుకున్న చర్యల్లో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు జాతీయ స్థాయిలో మూడో సంస్థగా నిలిచి అవార్డు దక్కించుకుంది. కోల్‌కత్తాలోని ఫోరం ఆఫ్ ఉమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ 33వ జాతీయ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ తరపున పాల్గొన్న ఎస్.చంద్రావతికి, ఇతర ఆఫీస్ బేరర్లకు స్కోప్ డైరెక్టర్ జనరల్ అతుల్ సోబ్తి, పశ్చిమబెంగాల్ హోంగార్డు డైరెక్టర్ జనరల్ అండ్ కమాండెంట్ జనరల్ ఎంకె.సింగ్ అవార్డు అందజేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఆర్‌అండ్‌డి విభాగంలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్న వారణాసి సుగుణ సౌమ్య జాతీయ స్థాయిలో ఉత్తమ మహిళా ఉద్యోగిగా మొదటి బహుమతి అందుకున్నారు. రాజ్యభాష విభాగంలో అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ డాక్టర్ కెఎన్‌ఎల్‌వి.కృష్ణవేణి మూడో స్థానంలో నిలిచి అవార్డు సొంతం చేసుకున్నారు. స్టీల్‌ప్లాంట్ శిక్షణ విభాగంలో జిఎంగా పనిచేస్తున్న ఎన్.భాను, టెలికం విభాగంలో డిజిఎంగా పనిచేస్తున్న కె.సరళ ఉత్తమ న్యూస్ లెటర్ అవార్డును అందుకున్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు అందుకున్న మహిళా ఉద్యోగులను స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్ భట్ అభినందించారు.

అధికారం కోసమే వివేకా హత్య

- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు : అచ్చెన్నాయుడు
- 'జగనాసుర రక్తచరిత్ర' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
సిఎం జగన్ అధికారం కోసం తన సొంత బాబాయి వివేకానందరెడ్డిని బలితీసుకున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఆరోపించారు. వివేకా హత్య తాలూక వాస్తవాలతో 'జగనాసుర రక్తచరిత్ర' పుస్తకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం ఈ పుస్తకాన్ని ఆ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ప్రతి ఇంటికీ అందిస్తామని, అప్పుడే ప్రజలకు నిజాలు, హత్యకు పాల్పడిన దోషుల వివరాలు తెలుస్తాయని తెలిపారు. వివేకా హత్య కేసును సిబిఐ త్వరగా విచారణ ముగించి అసలు సూత్రధారులు, పాత్రధారుల్ని శిక్షించాలని కోరారు. వైసిపి గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామన్నారు. వివేకా హత్యను తమ పార్టీ అధినేత చంద్రబాబుపై మోపి జగన్ లబ్ధిపొందారని పేర్కొన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ.. తెలంగాణలో వైఎస్ షర్మిలకు జరిగిన సంఘటనపై జగన్‌ను ప్రశ్నించిన ప్రధానమంత్రి, రాష్ట్రంలో ప్రాథమిక హక్కులు హరించుకుపోతున్నా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వివేకా కేసులో ప్రధాన సూత్రధారి, పాత్రధారి జగనే అని నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రజాకోర్టులో జగన్‌కు శిక్ష తప్పదని హెచ్చరించారు. వాస్తవాలు బయటకొచ్చినా పదవికోసం వెంపర్లాడుతున్నారని నక్కా ఆనంద్ బాబు అన్నారు. ఢిల్లీ వెళ్లినా, ప్రత్యేక విమానాల్లో పరుగులుపెట్టినా వివేకా హత్యకేసు నుంచి సిఎం దంపతులు తప్పించుకోలేరని వర్ల రామయ్య పేర్కొన్నారు. ప్రతి మహిళా చదవాల్సిన జగనాసుర రక్తచరిత్ర పుస్తకం అని ప్రధాన కార్యదర్శి పంచుమర్తి అనురాధ అన్నారు.

ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి
గ్రామీణాభివృద్ధి కోసం పనులు చేస్తే ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కల్పించారని కె అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి హయాంలో చేపట్టిన పనుల బిల్లులు ప్రస్తుత ప్రభుత్వం చెల్లించకపోవడంతో 50 వరకు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఉపాధి హామీ చట్టం, నీరు చెట్టు పెండింగ్ బిల్లులపై సమీక్ష సమావేశం జరిగింది. టిడిపి హెఆర్‌డి ఛైర్మన్ బి రామాంజనేయులు మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద 2018-19 సంవత్సరానికి సంబంధించిన బకాయిలు రూ.763.13 కోట్లు ఉన్నాయని తెలిపారు. మరో రూ.529.13 కోట్లకు సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, దీనిపై తక్షణమే న్యాయ పోరాటం చేయాలని పేర్కొన్నారు.

కార్మికుల మృతదేహాలకు పోస్టుమార్టం

- కుటుంబ సభ్యులకు అప్పగింత
- బాధితులకు మంత్రి రాజా రూ.50 వేల చొప్పున సాయం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్
కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో చనిపోయిన ఏడుగురు కార్మికుల మృతదేహాలకు శుక్రవారం ఉదయం కాకినాడ జిజిహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాలను గురువారం సాయంత్రమే కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి మృతుల కుటుంబ సభ్యులు వచ్చేసరికి రాత్రి అవడంతో పంచనామాను వాయిదా వేశారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబ సభ్యులను మంత్రి దాడిశెట్టి రాజా పరామర్శించి ఆర్థిక సాయం రూ.50 వేలు చొప్పున అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రూ.50 లక్షల పరిహారంతోపాటు, ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని మంత్రి వెల్లడించారు.

కమిటీలతో కాలయాపన

(మొదటి పేజీ తరువాయి)
విచారణ చేయాల్సి ఉంది. ప్రమాదం జరిగిన పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని ఆయిల్ పరిశ్రమను జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా, కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఎం.అశోక్‌కుమార్, ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ నాగూల్ మీరా శుక్రవారం సందర్శించారు. అయిల్ ట్యాంక్‌లోని మడ్డు శ్యాంపిల్స్‌ను సేకరించారు. వీటిని పరీక్షల నిమ్తితం ల్యాబ్‌కు పంపనున్నామని వారు తెలిపారు.

జి.రాగంపేట ఫ్యాక్టరీకి అనుమతి ఉందా?
అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ కంపెనీకి మెయిన్ బ్రాంచి సామర్లకోటలో ఉంది. దీని అనుమతులనే చూపుతూ జి.రాగంపేటలో ఫ్యాక్టరీని నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. అనుమతులపై సంబంధిత అధికారులు నేటికీ పెదవి విప్పకపోవడంపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పూర్తి స్థాయిలో విచారించి నివేదికను బహిర్గతం చేయాలి



పరిశ్రమల్లో భద్రత డొల్లతనం బయటపడుతూ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అనేకమంది కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఆయిల్ పరిశ్రమలో జరిగిన ఘటన విషయంలోనైనా నివేదికను బయట పెట్టి ఎలాంటి చర్యలు తీసుకున్నారో ప్రకటించాలి. పరిహారం ఇచ్చేశాం, చేతులు దులుపుకున్నాం అనే ధోరణిలో కాకుండా ఎవరి ఒత్తిళ్లకూ తలొగ్గకుండా పూర్తి స్థాయిలో విచారణ సాగేలా చూడాలి. అన్ని పరిశ్రమల్లోనూ పని పరిస్థితులపై కార్మికులను నేరుగా విచారించాలి.
- సిహెచ్ రాజ్‌కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా

బిజెపిది పచ్చి అవకాశవాదం

(మొదటి పేజీ తరువాయి)
నియమిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకుండా నిరోధించేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని పోరాడాలని పిలుపునిచ్చారు. అదాని అవినీతి కుంభకోణం నుండి ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకు 'కౌహగ్' పేరుతో భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు బిజెపి కొత్తగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకొచ్చిందని, మతోన్మాద కార్యకలాపాలను ప్రమాదకరస్థాయికి తీసుకెళుతోందని అన్నారు. ఇది వ్యక్తుల స్వేచ్ఛపై దాడి తప్ప దేశభక్తి కాదన్నారు. ఆవును కూడా తమ రాజకీయాలకు బిజెపి బలిచేస్తోందని విమర్శించారు. బిజెపి దేశాన్ని సుడిగుండంలోకి దించుతోందని, సాంస్కృతిక నిరంకుశత్వాన్ని రుద్దుతోందని పేర్కొన్నారు. యువత ఇష్టాయిష్టాలను, స్వేచ్ఛగా బతికే హక్కును కాలరాస్తోందని, యువత దీన్ని చైతన్యంతో ఎదుర్కోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల దుర్మరణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ నగరంలోని ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన వెంకోజీపాలెం జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజాము చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎండాడ ప్రాంతానికి చెందిన సాయి (21), దుర్గాప్రసాద్ (21), గోపి (22) కలిసి ద్విచక్ర వాహనంపై హనుమంతువాక నుంచి మద్దిపాలెం వైపు వెళు తున్నారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం వెంకోజీపాలెం వద్దకు చేరుకోగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో గోపి కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా మిగిలిన వారు విద్యార్థులు. నగర డిసిపి గరుడ సుమిత్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను కెజిహెచ్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో సిసి కెమెరాల ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. బైకు అదుపుతప్పడం వల్ల మృతి చెందారా? ఏదైనా భారీ వాహనం వెనుక నుంచి ఢీకొనడం వల్ల చనిపోయారా? అన్నది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విఆర్‌ఎలను ఫేస్ యాప్ అటెండెన్స్ నుంచి మినహాయించాలి

- సిసిఎల్‌ఎకు ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఎ)కు ఫేస్‌యాప్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి, ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి జయరాజ్, వెంకట్రావు, కోశాధికారి సత్యనారాయణ మంగళగిరిలోని సిసిఎల్‌ఎ కమిషనరు కార్యాలయంలో సిసిఎల్‌ఎ సాయిప్రసాద్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ రెవెన్యూ సహాయకులు పార్ట్‌టైమ్ వృత్తిగా పనిచేసే ఉద్యోగులని, వీరికిచ్చే జీత భత్యాలు గౌరవ వేతనం మాత్రమేనని వినతి పత్రంలో పేర్కొన్నారు. అతి తక్కువ జీతంతో స్మార్ట్ ఫోన్ కూడా కొనుక్కోలేనివారు ఉన్నారన్నారు. సిసిఎల్‌ఎ కమిషనర్ స్పందించారని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

పోర్టు ఆస్తులను ప్రయివేటుపరం చేయొద్దని ధర్నా



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పోర్టు ఆస్తులు, హాస్పటల్, కల్యాణ మండపాలు, స్టేడియం తదితర ప్రభుత్వ ఆస్తులను మౌలిక సదుపాయాల కల్పన ముసుగులో ప్రయివేటువారికి కట్టబెట్టాలన్న యాజమాన్య చర్యలను ఖండిస్తూ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖలోని సీహార్స్ జంక్షన్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవాధ్యక్షులు జెవి.సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వివిఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ ఎంతో విలువైన విశాఖపట్నం పోర్టు ట్రస్టు స్థలాలను, స్టేడియం, కల్యాణ మండపాలను ప్రయివేటువారికి కట్టబెట్టాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మేజర్ పోర్టుల అథారిటీ యాక్ట్ అమలులోకి వచ్చిన తరువాత పోర్టులకు చట్టపరమైన రక్షణ నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ, అంబానీ కుటుంబాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పాటుపడుతోందని విమర్శించారు. విశాఖ నగర నడిబొడ్డున ఉన్న పోర్ట్ ఆస్పత్రిని పిపిపి పద్ధతిలో ప్రయివేటుకు కేటాయించడానికి షిప్పింగ్ మినిస్ట్రీ అనుమతికి పోర్టు యాజమాన్యం పంపడాన్ని చూస్తే.. ప్రజా సంపదను ఏవిధంగా హరిస్తున్నారో ఇట్టే అర్థమవుతుందన్నారు. మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టులుగా మార్చొద్దని కోరారు. సిహెచ్ క్యాజువల్, ఫుల్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు పిడిఎఫ్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ మద్దతు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్‌ల నుంచి సిఐటియు నాయకులు తరలివచ్చి మద్దతు ప్రకటించారు.



ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

చంద్రప్రకాశ్ జోషిపై చర్యలు తీసుకోవాలి

- ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిజెపి ఎంపి చంద్రప్రకాశ్ జోషిపై చర్యలు తీసుకోవాలని, సతీసహగమనం సాంప్రదాయం గొప్పది అని చేసిన వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోవాలని ఐద్వా, శ్రామిక మహిళ సంఘం ఆధ్వర్యంలో కర్నూలులో శుక్రవారం నిరసన తెలిపారు. ఎంపిపై చర్యలు తీసుకోవాలని నగరంలోని 24వ వార్డు సచివాలయం ఎదుట ప్లకార్డులతో నినాదాలు చేశారు. రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పి) సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి మాట్లాడుతూ.. భరతమాత అంటూనే భారతీయ స్త్రీలను సజీవంగా దహనం చేసి ఆనందించే రాక్షసత్వం కలిగిన మానవ మృగాలు బిజెపి ప్రజాప్రతినిధులు అని విమర్శించారు. ముస్లిం మహిళలు హిజాబ్ ధరించడం నేరమని, మహిళల వస్త్రాధారణపై అవాకులు, చెవాకులు మాట్లాడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దేశంలోని ముస్లిములను, క్రైస్తవులను చంపాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద హిందూ పూజారి మహామండలేశ్వర స్వామి రెచ్చగొట్టడం దుర్మార్గమన్నారు. నిరసన కార్యక్రమంలో ఐద్వా నాయకులు వి.రాధిక, కె.సరిత, వెంకటేశ్వరమ్మ, జ్యోతి తదితరలు పాల్గొన్నారు.

పంట పొలాల్లో 'యువగళం'

- 15వ రోజుకు లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి - ఎస్‌ఆర్‌పురం (చిత్తూరు జిల్లా)



పొలంలో అరక దున్నుతున్న నారా లోకేష్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర 15వ రోజు పంట పొలాల్లో సాగింది. చిత్తూరు జిల్లా ఎస్‌ఆర్‌పురం మండలంలోని ఎగువ కమ్మకండ్రిగ పంచాయతీ కమ్మకండ్రిగ గ్రామంలో శుక్రవారం ఉదయం లోకేష్ పాదయాత్రను ప్రారంభించారు. రాణిపురం, ఎగువ కమ్మకండ్రిగ, పుల్లూరు, కాపుకండ్రిగ, పద్మాపురం, ఆర్‌ఆర్‌పురం, ఎఎంపురం మీదుగా సింధు రాజపురం వరకు 16 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. కమ్మకండ్రిగలో కన్నయ్యకు చెందిన పొలంలో రైతులతో కలిసి దుక్కిదున్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఎగువకండ్రిగ గ్రామంలో బెల్లం గానుగ దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే బెల్లం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని తెలిపారు. ఎస్‌ఆర్‌పురం మండలంలో నారా లోకేష్ ప్రసంగించడానికి పోలీసులు అనుమతించలేదు. అయినా ప్రతి గ్రామంలోనూ ఆయన గళాన్ని వినిపించారు. పుత్తూరు గ్రామ పంచాయతీ కాపుకండ్రిగ గ్రామంలో ఎస్‌సికి చెందిన యువతీ, యువకులతో ముఖాముఖి నిర్వహించారు. ఎస్‌సి కార్పొరేషన్ నిధులు మంజూరు కావడంలేదని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయడంలేదని దళిత యువత ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కూడా తమ సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలన్నింటికీ పరిష్కార మార్గాన్ని చూపిస్తామని తెలిపారు. ఎస్‌ఆర్‌పురం హనుమాన్ టెంపుల్ వద్ద గ్రామస్తులతో సమావేశమయ్యారు. రాత్రికి విడిది కేంద్రంలోనే బస చేశారు.



బాధితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ధనలక్ష్మి, తదితరులు

బాధితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

- రూ.1.50 లక్షల చెక్కు అందజేసిన ఎపి ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

హత్యాచారానికి గురైన ఆశా కార్యకర్త రమావత్ లీలావతి కుటుంబానికి ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆర్థిక సాయం అందజేసింది. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం బైపాస్ వద్ద సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆశా కార్యకర్త భర్తకు రమావత్ లస్కర్ నాయక్, ఆమె కుమార్తెలకు రూ.1.50 లక్షల సాయాన్ని శుక్రవారం సంఘం ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. హత్యాచారం జరిగి నాలుగు నెలలు కావస్తున్నా దోషులను ఇంతవరకు శిక్షించలేదని తెలిపారు. మృతురాలి కుటుంబానికి తక్షణమే రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దోషులను శిక్షించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ కోశాధికారి కమల, యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శివకుమారి, నాయకులు సౌభాగ్యం, సుధారాణి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి)

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిన పడిందని సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించడం.. మరోపక్క రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉండడం.. వంటి అర్థం కాని లెక్కలతో అందరినీ మాయ చేస్తున్నారని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్.ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ నెల ఐదో తేదీలోపు 95 శాతం మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం, ఈ నెల పదో తేదీ వచ్చినప్పటికీ 30 శాతం మందికి మాత్రమే జీతాలు చెల్లించారని, 70 శాతం మందికి జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఉద్యోగులకు ఒకటిన్నర సంవత్సరంగా చెల్లించాల్సిన పిఎఫ్, ఎపిజిఎస్ఐ, డిఎలు, సరెండర్ లీవులు సహా అనేక అరియర్లు సుమారు రూ.మూడు వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉందని తెలిపారు.

వాటిని కనీసం కొంతమేరకైనా ఇవ్వకపోగా, వేతనాలను సైతం సమయానికి చెల్లించడంలేదని తెలిపారు. వేతనాల ఆలస్యం వల్ల ఇఎంఐలు చెల్లించలేకపోతున్నారని, దీంతో ఫెనాల్టీలు చెల్లించాల్సి రావడంతోపాటు బ్యాంకుల నుంచి భవిష్యత్‌లో రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు జనవరి 15వ నాటికి కొంతమేర చెల్లిస్తామని డిసెంబర్‌లో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక శాఖ అధికారులు ప్రకటించారని, గడువు ముగిసి నెలరోజులు దాటినా దాని ఊసే ప్రస్తావించడంలేదని తెలిపారు. ఈ పరిస్థితులను గమనిస్తే రాష్ట్ర ఆర్థిక పురోగమనంపై సందేహాలు కలుగుతున్నాయని, వాస్తవ పరిస్థితులు ఏమిటో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సహాధ్యక్షులు, కె.సురేష్‌కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీ రాజా, ఎస్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

అడ్డొస్తారని దాడి

- యథేచ్ఛగా ఇసుక రవాణా, కోడిపందాలు
- లంక భూముల సాగుకు సిద్ధమైన దళితులపై పెత్తందారుల పైశాచికం

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా



లంక భూముల్లో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దళితులు (ఫైల్)

కృష్ణా నదీపరివాహక ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న వంద ఎకరాల లంక భూములను తమకు ఇస్తే సాగు చేసుకుని జీవనం సాగిస్తామని బాపట్ల జిల్లా, కొల్లూరు మండలం, చింతలంక, పెదలంక దళితులు, పేదలు ఎప్పటినుంచో ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగారు. హామీలయితే ఇచ్చారు గానీ అవి అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో చింతలంక, పెదలంక దళితులు కలిసి లంక భూముల్లోని పిచ్చి మొక్కలను తొలగించి, సాగుకు సన్నద్ధమయ్యారు. అయితే లంక భూముల్లోని ఇసుకను తరలిస్తున్న అధికార పార్టీ నేత ఒకరు పెసర్లంక, గాజుల్లంక గ్రామాల పెత్తందారులను ఉసిగొల్పి దళితులపై మారణాయుధాలతో దాడి చేయించారు.

ఇసుక రవాణా అంతా ప్రస్తుతం దళితులు అడుగుతున్న భూముల నుంచే సాగుతోంది. దళితులకు భూములు ఇచ్చినా లేదా వారు సాగుకు సిద్ధమైనా ఇసుక అక్రమ రవాణాకు ఇబ్బందులు ఏర్పడతాయి. లంక భూముల్లో కోడి పందేలు, జూదం లాంటివి నడుస్తున్నాయి. ఈ భూములు కనుక దళితుల స్వాధీనంలోకి వెళ్తే ఇసుక అక్రమ రవాణాతో పాటు చీకటి కార్యక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. భూములు ప్రభుత్వానివి అయినప్పటికీ దళితులకు సదరు భూములు దక్కకూడదన్న ఉద్దేశంతోనే అధికారం అండగా సుమారు 200 మంది పెత్తందారులు దళితులపై దాడి చేశారు. రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు చెందిన వేమూరు నియోజకవర్గంలో దళితులపై మూకుమ్మడి దాడికి తెగబడితే మంత్రి నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడం శోచనీయం. దళితులపై దాడులు జరిగిన సందర్భాల్లో ఘటనా స్థలాన్ని జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు సందర్శించి బాధితలను విచారించాల్సి ఉందని చట్టం చెబుతున్నా సదరు అధికారులు కనీసం స్పందించకపోవటం గమనార్హం. బాధిత దళితులు తమకు న్యాయం చేయాలని ఇటీవల కొల్లూరు రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నిందితులపై కేసులు నమోదు చేసి.. అరెస్టు చేస్తామని పోలీసులు చెప్పారు. కానీ బాధితుల పక్షాన నిలబడిన సిపిఎం కొల్లూరు మండల కార్యదర్శి తోడేటి సురేష్‌పై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఈ ఘటన నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు అంద్ర మాల్యాద్రితో కలిసి బాధితులను పరామర్శించారు. మంత్రి నాగార్జున దళితుల పక్షమా లేక పెత్తందారుల పక్షమా? అని ప్రశ్నించారు. దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, 307 సెక్షన్ పెట్టాలని, నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు లంక భూములను అప్పజెప్పాలని డిమాండ్ చేశారు.

దాడికి పన్నాగం ఇసుక మాఫియాదే

సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

దళితులు, పేద బలహీనవర్గాలకు చెందిన వారు సొసైటీగా ఏర్పడి లంక భూములను సాగు చేసుకుంటామని కలెక్టర్, తహశీల్దార్, జిల్లా మంత్రి మేరుగ నాగార్జునను కలసి పలుమార్లు విన్నవించుకున్నారు. ఖాళీగా ఉండి ఎలాంటి వివాదం లేని భూములను దళితులకు ఇచ్చేందుకు మంత్రి సానుకూలత వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారు సదరు భూములను బాగు చేసుకుంటున్న క్రమంలో ఇసుక మాఫియాకు చెందిన వారు దళితులపై దాడులకు పాల్పడ్డారు. ఈ భూములు దళితులపరమైతే తమ ఇసుక అక్రమ వ్యాపారానికి, కోడి పందేలకు ఆటంకం ఏర్పడుతుందని ఇలా దాడులకు తెగబడ్డారు.

'అనంత'లో ప్రయివేటు విద్యాసంస్థల బంద్ విజయవంతం

విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారణమైన 'నారాయణ' పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్



ఎవిఆర్ పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఫీజు వేధింపులు తాళలేక ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారకులైన అనంతపురం జిల్లా నారాయణ విద్యా సంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రయివేటు విద్యా సంస్థలు మూతబడ్డాయి. అనంతపురం, రాయదుర్గం, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎపిఎస్‌ఎఫ్, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించాయి. రాయదుర్గంలో విద్యారణ్య జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 7న అనంతపురం నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న నారాయణ కళాశాల యాజమాన్యం ఫీజుల కోసం ఒత్తిడి చేయగా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భవ్యశ్రీ అనే విద్యార్థిని కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించిందన్నారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోందని తెలిపారు. వైద్య ఖర్చులను నారాయణ యాజమాన్యమే భరించాలని, విద్యార్థిని ఆత్మహత్యకు కారణం అయిన కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎపిఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

యాహులో 20% ఉద్యోగులపై వేటు



న్యూఢిల్లీ : ఆర్థిక మాంద్యం భయాలతో ఖర్చులను తగ్గించుకునే ఉద్దేశంతో సర్చ్ఇంజన్ యాహు తన ఉద్యోగుల్లోంచి 20 శాతం పైగా మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ తొలగింపుల్లో యాహూ యాడ్ టెక్ ఉద్యోగుల్లో 50 శాతం మంది ఉన్నారు. దాదాపుగా 1600 కంటే ఎక్కువ మందిపై వేటు వేసింది. గురువారం ఆఫీసు కార్యకలాపాలు ముగిసే సమయానికే కంపెనీలో 12 శాతం అంటే 1,000 మందిని తొలగిస్తున్నట్లు ఆ కంపెనీ స్పష్టం చేసింది. మరో 8 శాతం అంటే 600 మందికి వచ్చే ఆరు నెలల్లో ఉద్వాసన పలుకుతామని బాంబు పేల్చింది. లాభదాయకతలేని కంపెనీ ప్రకటన వ్యాపారాన్ని మరింత బలోపేతం చేయడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని యాహు సిఇఒ జిమ్ లైన్‌జోన్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కంపెనీలు కూడా ఉద్యోగులను తొలగిస్తాయనే వార్తలు టెక్ ఉద్యోగుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.

భారత్‌లో మొత్తం టిక్‌టాక్ ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ : ప్రముఖ సోషల్ మీడియా యాప్ టిక్‌టాక్ భారత్‌లో పని చేస్తున్న తన ఉద్యోగులందరినీ తొలగిస్తున్నట్లు ప్రకటించింది. బైట్‌డ్యాన్స్‌కు చెందిన ఈ యాప్‌ను దేశ భద్రత కారణాలతో 2020లో కేంద్ర ప్రభుత్వం నిషేధించినప్పటికీ.. ఇక్కడ ఇప్పటికీ విదేశీ కార్యకలాపాల అవసరాల కోసం కొద్ది మంది ఉద్యోగులను కొనసాగిస్తుంది. భారత్ నుంచి బ్రెజిల్, దుబాయ్ మార్కెట్లకు పనిచేస్తున్న ఉద్యోగులందరినీ తాజాగా తొలగించింది.

లోకేష్ పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ : వైసిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు జనం లేక అట్టర్ ఫ్లాప్ షోగా మారిందని, అది కప్పిపుచ్చుకునేందుకే వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని వైసిపి సంయుక్త కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బాబు స్వార్థానికి ప్రతిరూపమే అమరావతి అని విమర్శించారు. చంద్రబాబు మీడియా సమావేశం చూస్తే.. వికేంద్రీకరణ జరగకూడదని, మళ్లీ ఒకచోటే అభివృద్ధి అంతా కేంద్రీకృతం కావాలని, 13 జిల్లాలుగా ఉన్న రాష్ట్రం 26 జిల్లాలుగా మారకూడదని భావిస్తున్నట్లుగా ఉందన్నారు.

డిసిఐ అత్యధిక టర్నోవర్ రూ.372.30 కోట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా మంత్రిత్వ శాఖ పరిధిలో విశాఖపట్నం కేంద్ర కార్యాలయంగా నడుస్తున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డిసిఐఎల్) గడిచిన త్రైమాసికంలో అత్యధికంగా టర్నోవర్ రూ.372.30 కోట్లు సాధించిందని పోర్టు ట్రస్ట్ చైర్మన్, డిసిఐ సిఎండి కె.రామ్మోహనరావు తెలిపారు. హెచ్‌బి కాలనీలోని డిసిఐ కేంద్ర కార్యాలయంలో జరిగిన అధికారులు, ఉద్యోగుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో నికర లాభం రూ.13.84 కోట్లు కాగా, ఇపిఎస్ షేర్ విలువ రూ.4.94గా నమోదైందని తెలిపారు. వడ్డీ, పన్నులు, తరుగుదల (డిప్రిసియేషన్) అన్నీపోనూ ఈ త్రైమాసికంలో ఆదాయార్జన 62.08 కోట్లు సాధించగా, గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.45.15 కోట్లే సాధించిందన్నారు. దీంతో మిగిలిన త్రైమాసికాలతో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరం అత్యధికంగా లాభార్జనలోకి వెళ్లినట్లు తెలిపారు. డిసిఐ చేపట్టిన కాంట్రాక్టులు, పనుల నిర్వహణ అంతా సజావుగా, సకాలంలో ముందుకు సాగడం సంతృప్తినిచ్చిందని వెల్లడించారు. ఇదే తరహాలో డిసిఐ త్వరితగతిన ప్రాజెక్టులన్నిటినీ పూర్తి చేసి ఈ ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ.1000 కోట్ల మైలురాయిని దాటే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



మారుతీ చౌదరిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

కళ్యాణదుర్గంలో ఉద్రిక్తత

- మంత్రి ఉషశ్రీ అవినీతికి సంబంధించిన ఆధారాలు బయటపెడతామన్న టిడిపి నాయకులు
- పలువురు నేతలను అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఉద్రిక్తత నెలకొంది. కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్ భూ కబ్జాలకు సంబంధించిన అవినీతి ఆరోపణలన్నీ తమ వద్ద ఉన్నాయని, వాటిని బయటపెడతామని టిడిపి మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కుమారుడి మారుతి చౌదరి గురువారం ప్రకటించారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుకోకుండా గురువారం రాత్రి నుంచే పికెటింగ్ నిర్వహించారు. ఎటువంటి నిరసనలూ తెలియజేసేందుకు వీల్లేందని ఆదేశాలు జారీ చేశారు. పలువురు ముఖ్యనేతలను గృహ నిర్బంధం చేశారు. భూ కబ్జాలకు సంబంధించిన పేపర్లను తీసుకుని శుక్రవారం ఉదయం కళ్యాణదుర్గం టీ సర్కిల్ వద్దకు తన అనుచరులతో కలిసి మారుతి చౌదరి వచ్చారు. పోలీసులు ఆయనను బలవంతంగా అరెస్ట్ చేసి, స్టేషన్‌కి తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. మంత్రి అవినీతిని ప్రజలకు కచ్చితంగా తెలియజేస్తామంటూ మారుతీచౌదరి తెలిపారు.

'అనంత'ను అదానీ జిల్లాగా మార్చేస్తారా.? : సిపిఎం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వేలాది ఎకరాల భూములను అదానీకి అప్పగించి అనంతపురాన్ని అదానీ జిల్లాగా మార్చేస్తారా అంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రశ్నించారు. నగరంలోని గణేనాయక్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అదానీ కంపెనీపై ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక ఆరోపణలు వెల్లువెత్తుతోన్న తరుణంలో జిల్లాలోని 406 ఎకరాల భూమిని ఆ కంపెనీకి ఇవ్వడానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.86 లక్షల ఎకరాల భూములు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గతంలో జిల్లాలో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్ కంపెనీలన్నీ ప్రభుత్వ సాయంతో రైతుల నుంచి భూమిని కొనుగోలు చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాయని గుర్తు చేశారు. అదానీ కంపెనీ మాత్రం భూములను అద్దె పద్ధతిలో సేకరిస్తుండటం, అద్దె చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోకపోవడంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. లీజు చెల్లింపుల్లో కూడా స్పష్టత లేదన్నారు. ప్రభుత్వాలకు రైతుల ప్రయోజనాల కంటే అధికార పార్టీ ప్రయోజనాలు, అదానీ కంపెనీ ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. రైతులతో కచ్చితమైన ఒప్పందం చేసుకుని, సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన సిపిఎం నిలబడి పోరాటం చేస్తుందని తెలియజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, నాగేంద్రకుమార్, బాలరంగయ్య పాల్గొన్నారు.

'బోయ/వాల్మీకి, బెంతో ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు'

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా), విజయవాడ

బోయ/వాల్మీకి, బెంతో ఒరియాలను గిరిజనుల జాబితాలో చేర్చొద్దంటూ ఎపి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోత రాంబాబు, కిల్లో సురేంద్ర, ఉపాధ్యక్షులు చిట్టిబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు శోభ దామోదరం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బోయ/వాల్మీకిల అధ్యయనానికి ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ శామ్యూల్ ఆనంద్ కుమార్‌కు విజయవాడలో వినతిపత్రం అందజేశారు.

సంపాదకీయం

సాహోరే బ్రెజిల్

ప్రపంచవ్యాప్తంగా 'పెట్టుబడి' రాకాసికి తలొగ్గి పర్యావరణాన్ని, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న పాలకులకు పూర్తి భిన్నమైన మార్గంలో బ్రెజిల్ అధ్యక్షులు, వర్కర్స్ పార్టీ నేత లూలా డ సిల్వా నడుస్తున్నారు. ప్రజల ప్రాణ రక్షణకు ప్రత్యేకించి అమాయకులైన ఆదివాసీల సంక్షేమం విషయంలో మడమ తిప్పని నేతగా లూలా ప్రఖ్యాతినొందారు. ప్రపంచ ఊపిరితిత్తులుగా భావించే అమెజాన్ అడవుల్లో అక్రమ ఖనిజ తవ్వకాలకు పాల్పడుతున్నవారిపై యుద్ధం ప్రకటించారాయన. ఇదేమీ చిన్న విషయం కాదు. అమెరికా కీలుబొమ్మ బోల్సోనారో నేతృత్వంలోని గత ప్రభుత్వం అమెజాన్ అడవుల్లో అక్రమ బంగారం తవ్వకాలకు లాకులెత్తి అక్కడి మూలవాసులైన యనోమామి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడింది. అక్రమ ఖనిజ తవ్వకాలను అడ్డుకునేందుకు యత్నించిన యనోమామి ప్రజలపై మైనింగ్ మాఫియా క్రూరమైన దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో వందలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. భారీ స్థాయిలో అమెజాన్ అడవుల విధ్వసమూ జరిగిపోయింది. పరిసర ప్రాంతాల్లోని యురారికో ఎరా వంటి నదీ జలాలన్నీ ఖనిజ వ్యర్థాలతో కాలకూట విషంగా మారిపోయాయి. యనోమామి ప్రజలు అంతుచిక్కని వ్యాధుల బారినపడ్డారు. పోషకాహారలేమితో, నయం కాని రుగ్మతలతో ఆ ప్రాంతం నిస్తేజంగా మారింది. ఇంతటి విధ్వంసం యథేచ్ఛగా సాగిపోవాడానికి అక్రమ మైనర్లకు అండగా నిలిచిన అప్పటి బోల్సోనారో ప్రభుత్వమే ప్రధాన కారణం. అక్రమ మైనింగ్ కారణంగా అమెజాన్ అడవుల్లో మానవ హననం జరిగిపోతోందంటూ అంతర్జాతీయ మానవ హక్కుల సంఘంతో సహా అనేక పర్యావరణ, పౌర హక్కుల ఏజెన్సీలు నెత్తినోరూ మొత్తుకున్నా.. దున్నపోతుపై వర్షం పడిన చందంగా బోల్సోనారో వ్యవహరించారు.

పోర్చుగీసులో గ్యారిపేయిరస్‌గా పిలుచుకునే అక్రమ బంగారు ఖనిజ తవ్వకందార్లు 1970, 80లలోనే యనోమామి భూముల్లోకి చొరబడి ఖనిజ తవ్వకాలను యథేచ్ఛగా సాగించారు. ఆ తర్వాత 1990లలో యనోమామి ప్రజల భూభాగాన్ని 96 లక్షల హెక్టార్లకు కుదించి మైనింగ్ నుంచి ఆ ప్రాంతాన్ని మినహాయించారు. లక్షలాది మంది అక్రమ ఖనిజ తవ్వకం దార్లను యనోమామి భూభాగం నుంచి వెళ్లగొట్టారు. 2018 ఎన్నికల్లో పచ్చి మితవాద నాయకుడు బోల్సోనారో అధ్యక్షుడవ్వడంతో అక్రమార్కులకు పట్టపగ్గాలు లేకుండా పోయాయి. కుదించిన యనోమామి భూభాగంలోనూ ఖనిజ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోయాయి. అత్యంత విలువైన ఖనిజ సంపదను మూలవాసులకు ఎలా వదిలేస్తామంటూ? బోల్సోనారో నిర్లజ్జగా ప్రకటించారు. దీంతో అమెజాన్ అడవుల్లో మారణహోమం సాగింది. 'ఆదివాసీల నెత్తుటి రుచి మరిగిన ప్రభుత్వం'గా యనోమామి ప్రజలు బోల్సోనారో సర్కార్‌పై పోరు సల్పారు. వారికి లూలా డ సిల్వా అండగా నిలిచారు. పాశ్చాత్య దేశాల కుట్రలతో అక్రమ కేసుల్లో జైలు పాలైన లూలా గతేడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అద్భుత విజయం సాధించారు. ఈ ఏడాది జనవరి 1న బాధ్యతలు చేపట్టినదే తడవుగా ప్రజా సంక్షేమాలు ఒక వైపు కొనసాగిస్తూనే సహజ వనరులను, పరిశ్రమలను జాతీయం చేస్తూ సాహోరే బ్రెజిల్ అంటూ ప్రశంసలు అందుకుంటున్నారు. బోల్సోనారో వినాశకర విధానాలన్నిటినీ క్రమంగా రద్దు చేసి ప్రజా సంక్షేమానికి బాటలు వేస్తున్నారు. పెట్టుబడి మత్తులో జోగుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ భజన చేస్తున్న కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలకు వామపక్ష ప్రత్యామ్నాయ దీపస్తంభంగా నిలుస్తున్నారు. 'అక్రమ మైనింగ్ పరిసమాప్తి అయ్యేదాక విశ్రమించ'బోమన్న నినాదంతో సమరభేరీ మోగించి పర్యావరణ పరిరక్షణ పట్ల, ఆదివాసీ ప్రజల పట్ల వామపక్షాలకున్న నిబద్ధతను చాటి చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ గురించి ప్రపంచ మానవాళికి ఒకవైపు నీతులు చెబుతూ ఇంకోవైపు నుంచి గోతులు తవ్వుతున్న అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు బ్రెజిల్ చేపట్టిన ఆపరేషన్ ఒక గుణపాఠం. హిండెన్‌బర్గ్ నివేదికతో కలుగులోపడిన ఎలుకలా గిలగిలకొట్టుకుంటున్న గౌతమ్ అదానీ లాంటి కార్పొరేట్ పెద్దలకు కోస్తా తీరాన్ని, ఏజెన్సీ ప్రాంతాన్ని ఇంధన, ఖనిజ తవ్వకాల కోసం కారుచౌకగా దోచిపెడుతున్న కేంద్రంలోని మోడీ సర్కార్ కానీ, ఇటు వేలాది ఎకరాలను అప్పనంగా కట్టబెడుతున్న రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కానీ బ్రెజిల్ వామపక్ష ప్రభుత్వ సాహసోపేత చర్యల నుంచి నేర్వాల్సిన పాఠాలు చాలానే వున్నాయి. పర్యావరణహితం కోసం, ఆదివాసీల మనుగడ కోసం బ్రెజిల్ సాగిస్తున్న పోరాటాన్ని మనసారా అభినందిద్దాం.

మహనీయుల మాట



మతతత్వాన్ని మట్టుపెట్టే పని ముస్లింలు, సిక్కులు, హిందువులు, క్రైస్తవులు తదితరులందరిదీ. భారతీయులందరిదీ. దీనికోసం వారంతా మతతత్వ దృక్పథాన్ని అధిగమించి, నిజమైన జాతీయవాద మనస్తత్వాన్ని అలవరచుకోవాలి.

- సుభాష్ చంద్రబోస్

పట్టణాలపై కేంద్రం విసిరిన 'రింగ్ ఫెన్సింగ్'

విశ్లేషణ



డా॥ బి.గంగారావు



పట్టణాలు, నగరాలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలను 2023-24 కేంద్ర బడ్జెట్ విస్మరించింది. ఈసారి చిన్న పట్టణాలపై గురిపెట్టింది. ప్రైవేట్ పెట్టుబడులు, ప్రైవేట్ రుణాలు ప్రోత్సహించటం ద్వారా టైర్-2, టైర్-3 పట్టణాల్లో మౌలిక సదుపాయాలు కల్పించబోతున్నట్లు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అందుకుగాను చిన్న పట్టణాల మౌలిక సదుపాయాల కల్పన నిధిని రూ. 10 వేల కోట్లతో ఏర్పాటు చేశారు. ఈ నిధితో పాటు 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు, కేంద్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో వివిధ పథకాలకు కేటాయించిన నిధులను కూడా ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. అయితే ఈ నిధులను వినియోగించుకోవటానికి ఒక షరతు పెట్టారు. ఈ నిధులను ఉపయోగించుకునే పట్టణం తప్పనిసరిగా యూజర్ ఛార్జీలను ప్రజల నుండి అమలు చేయాలని నిబంధన విధించారు.

"రింగ్ ఫెన్సింగ్" విధానాన్ని అమలు చేయడం ద్వారా చిన్న పట్టణాల్లో సైతం పట్టణ సంస్కరణలను అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వం తెరలేపింది. రింగ్ ఫెన్సింగ్ అంటే పట్టణ పరిపాలనా వ్యవస్థ నుండి కొన్ని భాగాలను వేరుచేసి నిర్వహించటం. ప్రస్తుత మున్సిపల్ పరిపాలనా విధానంలో భాగంగా ఉన్న విధులు, కార్యకలాపాలు, ఆదాయాలు, వ్యయాలు, ఆస్తులు మొదలగు వాటిని వేరు చేసి ప్రత్యేక సంస్థల ద్వారా నిర్వహించటం. ఈ సంస్థలను చట్టపరంగా, ఆర్థికంగా స్వతంత్రంగా పనిచేసేలా ఏర్పాటు చేస్తారు. వీటికి ప్రత్యేక ఎస్క్రో అకౌంట్స్ ఏర్పాటు చేస్తారు.

ఉదాహరణకు నీటి సరఫరా. ఇది మున్సిపాలిటీ ముఖ్య విధి. ప్రస్తుతం ఈ విభాగం మున్సిపల్ కార్యకలాపాల్లో భాగంగా ఉంది. దీని ఆస్తులు, నిర్వహణ, కేటాయింపులు, ఖర్చులు వంటివన్నీ మున్సిపల్ కౌన్సిల్ పరిపాలనలో ఉన్నాయి. దీని లాభనష్టాలకు కూడా మున్సిపల్ కౌన్సిల్ బాధ్యత వహిస్తుంది. ఆదాయ-వ్యయాలను కూడా మున్సిపల్ బడ్జెట్‌లో చూపిస్తున్నారు. ఇప్పుడు "రింగ్ ఫెన్సింగ్" విధానంలో వీటిని మున్సిపల్ విధుల్లో చూపరు. మున్సిపల్ అకౌంట్స్‌లో కూడా చూపరు. ఈ విధానం అమలు చేసిన చోట మున్సిపల్ కౌన్సిల్‌కు ఈ రంగంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడానికి అధికారం ఉండదు. స్వతంత్రంగా పని చేస్తూ కౌన్సిల్‌కు జవాబుదారీగా ఉండదు.

మంచినీటి సరఫరాయే కాదు. పారిశుధ్యం, మురుగునీరు, పార్కులు, వీధి లైట్లు, ఖాళీస్థలాలు వంటి వాటన్నిటి నిర్వహణను విడివిడిగా చేయడమే "రింగ్ ఫెన్సింగ్" లక్ష్యం. వీటిని తరువాత ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్తారు.

ఈ రింగ్ ఫెన్సింగ్ విధానంలో నిర్వహణకు అయ్యే ఖర్చును మొత్తం ప్రజల నుండి వసూలు చేయడం ప్రధాన విధి. నీటి సరఫరా, పారిశుధ్యం, మురుగునీరు, వీధిలైట్లు, పార్కులు ఇలా ప్రతి రంగంలో ఏడాదికయ్యే ఖర్చును యూజర్ ఛార్జీల రూపంలో వసూలు చేయాలి. అలాగే టైర్-2, టైర్-3 పట్టణాలకు ఇచ్చే నిధులన్నీ సంస్కరణలకు ముడిపెట్టి ఇచ్చేవే. రూ.10 వేల కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన నిధి ఏర్పాటు అందుకే. ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధులు, పట్టణ ప్రాంతాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించే అమృత పథకం వంటి నిధులన్నీ షరతుల పరిధి లోకి వెళ్ళనున్నాయి. కేంద్రం విధించిన షరతులు అమలు చేస్తేనే వీటిని వినియోగించుకోవడం సాధ్యమవుతుంది.

> **ఈ రింగ్ ఫెన్సింగ్ విధానంలో నిర్వహణకు అయ్యే ఖర్చును మొత్తం ప్రజల నుండి వసూలు చేయడం ప్రధాన విధి. నీటి సరఫరా, పారిశుధ్యం, మురుగునీరు, వీధిలైట్లు, పార్కులు ఇలా ప్రతి రంగంలో ఏడాదికయ్యే ఖర్చును యూజర్ ఛార్జీల రూపంలో వసూలు చేయాలి. అలాగే టైర్-2, టైర్-3 పట్టణాలకు ఇచ్చే నిధులన్నీ సంస్కరణలకు ముడిపెట్టి ఇచ్చేవే. రూ.10 వేల కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన నిధి ఏర్పాటు అందుకే. ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధులు, పట్టణ ప్రాంతాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించే అమృత పథకం వంటి నిధులన్నీ షరతుల పరిధి లోకి వెళ్ళనున్నాయి. కేంద్రం విధించిన షరతులు అమలు చేస్తేనే వీటిని వినియోగించుకోవడం సాధ్యమవుతుంది.**

మరొక ప్రమాదకర నిర్ణయం ఏమిటంటే లక్ష లోపు జనాభా ఉన్న పట్టణాలను కూడా అప్పుల్లోకి దించబోతున్నారు. ఇప్పటి వరకు దేశంలో టైర్-2, టైర్-3 పట్టణాలు అప్పులు చేయలేదు. ఎక్కువ భాగం స్వంత పన్ను ఆదాయాలు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, కేంద్ర పట్టణ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక గ్రాంట్ల మీదనే ఆధారపడి నడుస్తున్నాయి. ఇప్పుడు వీటి రుణ సామర్థ్యాన్ని పెంచటానికి రింగ్ ఫెన్సింగ్ ఉపయోగపడుతుందని ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. రింగ్ ఫెన్సింగ్ కింద వేరు చేసిన విభాగాలకు నిధులను ప్రైవేట్ రుణాల ద్వారా, బాండ్ల ద్వారా సమకూర్చుకోవాలి. లేదంటే వీటి నిర్వహణ పూర్తిగా ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలి. ప్రతి విభాగంలో ఆదాయ-వ్యయాలు సమానం అయితేనే ఆ రంగంలో పెట్టుబడుల కల్పనకు రుణాలు ఇస్తారని లేదా బాండ్ల విడుదల ద్వారా పెట్టుబడులు సమకూర్చుకోవటం సాధ్యమౌతుందని ప్రభుత్వం అడ్డగోలుగా వాదిస్తున్నది.

నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో (53 నుంచి 56 పేరాలలో) పట్టణాల అభివృద్ధి వ్యూహం గురించి స్పష్టంగా పేర్కొన్నారు. అన్ని మున్సిపాల్టీలను మున్సిపల్ బాండ్ల అర్హతకు సిద్ధంచేయాలని పేర్కొన్నారు. అందుకు ఆస్తి పన్ను విధానాన్ని ఆస్తి విలువకు ముడిపెట్టి మదించే విధానాన్ని తీసుకురావాలని పేర్కొన్నారు. అలాగే మున్సిపల్ సంస్థల భూములను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పేర వాటిని ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని, అప్పుడే పట్టణాలు తమ కాళ్లపై తాము నిలబడగలవని పేర్కొన్నారు. అలాగే పట్టణ జోనింగ్ విధాన ప్రణాళికా విభాగాల్లో సంస్కరణలు ప్రైవేట్ పెట్టుబడులకు అనుగుణంగా మార్చాలని పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్ల ద్వారా ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా లేదా బాండ్ల ద్వారా అప్పులు పొందడం అంత తేలిక కాదు. ఈ అర్హత సాధించేందుకు ముందుగా అనేక సంస్కరణలను అమలు చేయాల్సి ఉంటుంది. మున్సిపల్ సంస్థల ఆర్థిక తీరుపై మదింపు జరగాలి. ఈ సంస్థలకు అప్పు పొందే అర్హతలు ఉన్నాయా? లేదా? అనేది నిర్ధారణ జరగాలి. ఆ తరువాత క్రెడిట్ రేటింగ్ సంస్థలు ఎఎఎ నుండి డి వరకు రేటింగ్ ఇస్తాయి. ఇప్పటి వరకు పెద్ద పెద్ద కార్పొరేషన్లు మాత్రమే క్రెడిట్ రేటింగ్‌ల ద్వారా అప్పులు పొందగలుగుతున్నాయి. ఇటీవల 364 స్మార్ట్, అమృత నగరాలు క్రెడిట్ రేటింగ్ పొందాయి. అయితే వీటిలో 144 సంస్థలు మాత్రమే అప్పులకు అర్హత పొందాయి. ప్రైవేటీకరణ విధానాలు అన్ని రంగాల్లో అమలు చేసే వాటికి, ప్రజల నుండి పౌరసేవలకు పెద్ద మొత్తంలో యూజర్ చార్జీలు వసూలు చేసే మున్సిపల్ సంస్థలకు మొదటి శ్రేణి ర్యాంకులు ఇస్తాయి. ప్రైవేటీకరణ విధానాలు అమలు చేయని మున్సిపల్ సంస్థలకు అప్పులకు అర్హత కలిగిన ర్యాంకులు ఇవ్వవు. ఇదంతా ఒక పెద్ద తంతు. ఈ పేర పౌర సేవలను ప్రైవేటీకరించటం, మౌలిక సదుపాయాల కల్పనలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర తగ్గించుకోవటం...అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేసే నిధులు తగ్గించుకోవటం, పట్టణ మౌలిక సదుపాయాలను ప్రైవేట్ సంస్థల పరం చేయటం వీటి వెనుక ఉన్న ప్రధానమైన కుట్ర.

పట్టణ రంగానికి సంబంధించి మొత్తం సంస్కరణలను అమలు చేయాలన్నదే ఈ బడ్జెట్ కేంద్ర లక్ష్యంగా ఉంది. పట్టణాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, సవాళ్లను ఏ మాత్రం పట్టించుకోలేదు. వీటన్నింటి కోసం అప్పుల ద్వారా ఆదాయాలు సమకూర్చుకోవాలని, ప్రైవేటీకరణ చర్యలు చేపట్టాలని, వినియోగ చార్జీలు వసూలు చేయాలని నివేదించింది. గత ఏడాది కన్నా 2023-24 బడ్జెట్‌లో పట్టణ రంగానికి కేటాయింపులు స్థూల జాతీయోత్పత్తిలో 0.5 శాతం నుండి 0.3 శాతానికి కోతపెట్టింది. స్మార్ట్ సిటీలకు 8800 కోట్ల నుండి 8 వేల కోట్లకు తగ్గించారు. ఈ పథకం అమలు ఈ ఏడాది జూన్‌తో ముగిసిపోతుంది. పట్టణ బడ్జెట్‌లో 33.32 శాతం మెట్రో రైళ్ల నిర్మాణానికి కేటాయించారు. ఇవి కూడా పిపిపి కింద చేపట్టేవే. కొన్ని నగరాలకే పరిమితం.

మూలధన వ్యయంపై ఈ ఏడాది లోపు పూర్తిగా ఖర్చు చేస్తే 50 ఏళ్ళ రుణాన్ని ఇస్తామని ఈ బడ్జెట్‌లో పేర్కొన్నారు. అయితే దానిలో కొంత భాగాన్ని మున్సిపల్ బాండ్లకు, పట్టణాలను క్రెడిట్ యోగ్యమైనవిగా మార్చటానికి, కొంత మొత్తాన్ని పట్టణ ప్రణాళికా సంస్కరణలు, ఫైనాన్సింగ్ సంస్కరణలు అమలు చేయటానికి ఖర్చు చేయాలని షరతు విధించింది. ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్ (టిఓడి) అనే కాన్సెప్ట్‌ను కూడా ఈ బడ్జెట్ ద్వారా తీసుకొచ్చారు. ప్రజా రవాణాను ప్రైవేట్ భాగస్వామ్యంలో నెలకొల్పాలనేది దీని ముఖ్య ఉద్దేశ్యం.

గత రెండు దశాబ్దాల నుంచి పట్టణ రంగంలో ప్రయివేటీకరణ విధానాల అమలుకు ప్రయత్నం చేస్తున్నారు. పథకాలు, నిధులు ఎరజూపి సంస్కరణల అమలుకు పూనుకుంటున్నారు. గతంలో జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ పథకం తీసుకొచ్చి దేశంలో 63 నగరాల్లో సంస్కరణల అమలుకు ప్రయత్నం చేశారు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులను కూడా సంస్కరణలకు ముడిపెట్టి ఇస్తున్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణ సంస్కరణల అమలుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ సిటీ పథకాన్ని 100 నగరాల్లో అమలుకు ప్రయత్నం చేస్తున్నది. దేశంలో తొలిసారిగా స్మార్ట్ సిటీలో పథకం అమలుచేస్తున్న నగరాల్లో ఎన్నికైన కౌన్సిళ్లకు, స్మార్ట్ సిటీ కింద చేపట్టే ప్రాజెక్టులకు సంబంధం లేకుండా చేసింది. ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలో నిర్ణయించుకొనే అధికారం కూడా కౌన్సిల్‌కు లేకుండా చేశారు. నిర్వహణ మొత్తం వేరు చేశారు. ఈ పథకాన్ని పూర్తిగా స్పెషల్ పర్పస్ వెహికల్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ పథకంలో చేపట్టిన పనుల్లో ఎక్కువ భాగం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం కింద చేపడుతున్నారు. దీని కింద ఖర్చు పెడుతున్న నిధులను తిరిగి వినియోగదారుల నుంచి తప్పనిసరిగా వివిధ రూపాల్లో వసూలు చేయాలన్న నిబంధన కూడా విధించారు.

మరొకవైపు నగరాల మధ్య పోటీ పెట్టి ర్యాంకులు ఇస్తూ...ప్రైవేటీకరణ విధానాల అమలు, మౌలిక సదుపాయాలకు సమీకృత పెట్టుబడి అనే దానిని కూడా ఏర్పాటు చేశారు. అన్ని రాష్ట్రాల్లో ఇటువంటి సంస్థలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నది. ఆంధ్ర రాష్ట్రంలో ఇప్పటికే ఎ.పి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థను ఏర్పాటుచేసింది. తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు కూడా ఈ తరహా సంస్థలను ఏర్పాటు చేశాయి.

మరొకవైపు ప్రపంచబ్యాంకు, ఎడిబి డిఎఫ్ఐఎ, యుఎస్ ఎయిడ్ వంటి సంస్థలన్నీ నేడు మనదేశ పట్టణ స్థానిక సంస్థలలో ప్రత్యక్ష జోక్యం చేసుకుంటున్నాయి. నిధుల సహకారం పేర పౌరసేవలన్నింటినీ ప్రైవేటీకరించాలని షరతులు విధిస్తున్నారు. కోవిడ్‌ను ఆసరా చేసుకొని మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే అప్పులకు పట్టణ సంస్కరణలకు ముడిపెట్టింది. ఆంధ్ర రాష్ట్రంలో ఆస్తి పన్నును ఆస్తి విలువకు ముడిపెట్టి భారీగా పన్ను పెంచింది. పారిశుధ్య రంగంలో యూజర్ ఛార్జీలు ప్రవేశపెట్టింది. రోడ్ల వెడల్పు పేర ఇంపాక్ట్ ఫీజును అమల్లోకి తెచ్చింది. ఇలా చాలా రాష్ట్రాల్లో కేంద్రానికి లొంగి ఈ సంస్కరణలను అమలుచేస్తున్నాయి.

వాస్తవంగా పట్టణ రంగం రాష్ట్ర జాబితా లోనిది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర జాబితా లోని అనేక రంగాలను తన పరిధిలోకి బలవంతంగా గుంజుకుంటున్నది. మున్సిపల్ చట్టాలను మార్చేస్తున్నది. అన్ని స్థాయిల్లోని పట్టణాలన్నింటిలో ఈ సంస్కరణల అమలు లక్ష్యంగా కొత్త కొత్త పథకాలను ప్రవేశపెడుతున్నది.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

★

జనవాక్యం

కరువు ప్రాంతాలుగా ప్రకటించండి


రాష్ట్రంలో వర్షాలు, సాగు నీరు పుష్కలంగా అందుబాటులో ఉన్నప్పటికీ పెద్దగా ఫలితం లేదు. గత రెండేళ్లుగా నల్లి, తామర పురుగు ధాటికి మిర్చి దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించిన పంట సాగుదారులు నేడు ఎకరాకు నాలుగు క్వింటాళ్ల పంట తీసేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ఫలితంగా వ్యవసాయ కూలీలకు పని దినాలు గణనీయంగా పడిపోయాయి. ఇతర అన్ని పంటల సాగులో కంటే మిర్చిలో పని దినాలు అధికంగా లభిస్తాయి. ఈ విషయంలో మిర్చికి ప్రత్యామ్నాయం లేదు. మొదటి 40 రోజులు మినహా మొక్కలు సర్దుబాటు చేసిన తరువాత వరుసగా మూడు నెలలపాటు కలుపుతీత పనులు దొరుకుతాయి. పంట కోత పనులు, గ్రేడింగ్ పనుల్లో రెండు నెలలపాటు మహిళలు తీరిక లేకుండా గడిపేవారు. కలుపులు మినహా మిగిలిన అన్ని దశల్లోనూ పురుష కూలీల శ్రమ మిర్చి పైరుకు సత్తువని చెప్పాలి. ఈ ఏడాది మిర్చి పంట సాగు పెరిగినా దిగుబడి ఆశాజనకంగా లేదు. శనగ, మొక్కజొన్న పంట సాగులో పని దినాలను పూర్తిగా యంత్రాలు కాజేశాయి. మహిళలకు సైతం స్థానికంగా పని దొరికే పరిస్థితి కరువైంది. కొత్తగా వలసలు పెరిగాయి. పైరు, పంట ఆశాజనకంగా ఉన్న రోజుల్లో సరదాగా పొలం వైపు వెంట తీసుకెళ్లి టీ, టిఫిన్ ఖర్చులు భరించే పంట సాగుదారు అందుకు భిన్నంగా నేడు ఉచితంగా కూలీల సహాయం ఆశించే పరిస్థితి నెలకొంది. మిర్చి సాగులో పురుషులకు పట్టుమని పది రోజుల పని దొరకడం కూడా కష్టమైంది. కూలీలతో పాటు కౌలు సాగుదారుకూ రోజువారీ పని కోసం వెతుకులాట తప్పడం లేదు. ఆదాయాలు పడిపోవడం, నిత్యావసరాల ధరలు పెరగడం వల్ల పేదలు పొట్ట కొట్టుకునే రోజులు వచ్చాయంటున్నారు. ఈ పరిస్థితుల్లో మిర్చి సాగు చేసే జిల్లాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలి. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. కేంద్రం మంజూరు చేసే వంద పని దినాలకు రాష్ట్ర ప్రభుత్వం మరో వంద పని దినాలు జత చేసి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని డబుల్ ఇంజిన్ పథకంగా మార్చాలి. స్థానికంగా బతకడం కష్టమనే ఆలోచనను పేదల నుండి దూరం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఉపాధి పనులు ముమ్మరం చేసి సకాలంలో వేతనాలు చెల్లిస్తూ గ్రామీణ పేదల ఆదాయ వ్యయాలను సరిచేయాలి.

- నలతోటి కోటేశ్వరరావు, బాపట్ల జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

సెటైర్

మాతో పెట్టుకోకు!



"కేంద్ర పశు సంవర్ధక శాఖ డౌన్ డౌన్" అని గట్టిగా ఆంబోతులు రంకెలు వేస్తున్నట్టు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఆ శబ్దాలు వినవస్తున్న దిశగా పరిగెత్తాను. చూతును కదా! కలెక్టర్ కార్యాలయం దగ్గర వందలకొద్దీ ఆంబోతులు గుమిగూడాయి. వాటిలో కొన్ని ముసలి ఆంబోతులు కలెక్టరాఫీసు ముందు కాళ్ళు మునగదీసుకుని బైఠాయించాయి. కలెక్టర్ గారితో సహా యావన్మందీ లోపలికి వెళ్ళలేక, ఏంచేయాలో తోచక బిక్కమొహాలు వేసుకుని చూస్తున్నారు. పోలీసు పటాలాలు వచ్చాయి. ఆంబోతుల మీద లాఠీ చార్జి చేయబోతే అవి తిరిగి కొమ్ములతో కుమ్మేశాయి. ఆ వైనం చూసిన పోలీసు కమిషనర్ వెంటనే లాఠీచార్జి ఆపెయ్యమని ఆదేశాలు ఇచ్చాడు. ఒకానొక ఉత్సాహవంతుడైన, తొందరగా ప్రమోషన్లు కొట్టేయాలన్న యావ బాగా ఉన్న ఒకానొక సర్కిల్ గారు నీటి ఫిరంగులను ప్రయోగించమని సూచించేడు. కమిషనర్‌కి ఆ సలహా నచ్చింది. కాని ఆ నీటి ఫిరంగుల ప్రయోగం కాస్తా బెడిసికొట్టింది. ట్యాంకర్ లోని నీళ్ళన్నీ అయిపోయాయి కాని ఆంబోతులు కదల్లేదు. ఎప్పటినుంచో స్నానాలు లేకుండా ఉన్నాయేమో మహదానందంగా నీటి ఫిరంగుల ప్రయోగాన్ని ఆస్వాదించాయి. పనికిమాలిన సలహా ఇచ్చాడని కమిషనర్ సదరు సిఐ మీద మండిపడ్డాడు. ఆ సిఐ తన ప్రమోషన్ కోరికను వదిలేసుకుని అక్కడినుంచి చల్లగా జారుకున్నాడు.

తమను ఈ లోగా సంప్రదించిన కలెక్టర్ గారికి " మనుషుల మీద మీ పోలీసులు వ్యవహరించినట్టు పశువుల యెడల వ్యవహరిస్తే గనుక అది జంతుహింస చట్టం వర్తించే వ్యవహారంగా మారిపోయి మీ మెడకు చుట్టుకోగలదు జాగ్రత్త" అని హెచ్చరించేరు న్యాయ కోవిదులు. తమకు తెలిసినంతవరకూ సెక్షన్ 144లు, సెక్షన్ 30లు, 351లు వగైరాలన్నీ జంతువులకి వర్తించిన దాఖలాలు ఏవీ లేవని కూడా స్పష్టం చేసేరు. "పోనీ, పులుల్నో, సింహాల్నో రప్పిద్దామేమిటి?" అని కలెక్టర్ గారు అడిగితే "అసలే అవి అంతరించిపోతున్న జాతులు. వాటిని రంగంమీదకు తెస్తే అంతర్జాతీయ సమస్య అయిపోతుంది జాగ్రత్త " అని చీఫ్ సెక్రటరీ జిల్లా కలెక్టర్ కి వార్నింగిచ్చేడు.

మరేమిటి దారి? ఎన్నో చిక్కు సమస్యల్ని పరిష్కరించిన అనుభవం ఉన్న ఒకానొక మాజీ అయ్యేయెస్ ని సలహా అడిగేరు. "అయ్యా! ఇది పశువులతో వ్యవహారం. మనుషులతోనైతే వేరు. పశువులతో ప్రజాస్వామ్య పద్ధతి తప్ప మరో విధంగా వ్యవహరించలేం. సంప్రదింపులే శరణ్యం" అని ఆయన సలహా ఇచ్చేడు. పశువులతో డీల్ చేయడంలో తలపండిన వారెవరని వెతకగా ఒకానొక బండెలదొడ్డి నిర్వాహకుడు తగిలేడు. అతగాడిని బతిమాలి, కాళ్ళూ, గెడ్డం పట్టుకుని మొత్తానికి చర్చలకు పంపేరు.

ఓ లారీడు పచ్చిగడ్డి వెంటరాగా ఆ మధ్యవర్తి చర్చలకు పయనమయ్యాడు.

మొత్తానికి సుదీర్ఘచర్చల తర్వాత ఆ మధ్యవర్తి వెనక్కి వచ్చేడు. కేంద్ర పశు సంవర్ధక శాఖ ఫిబ్రవరి 14ను "పశు కౌగిలి" దినంగా అమలు జరపమన్న సర్క్యులర్ ను బేషరతుగా ఉపసంహ రించు కోవాలన్నదే ఆంబోతుల డిమాండ్ అని అధికారులకు వివరించేడు. కలెక్టర్ గారికి గాని అక్కడున్న అధికారులకి గాని ఆ డిమాండ్ అంతుపట్టలేదు. పశువులని ప్రేమించమంటే అందుకు అభ్యంతరం ఆ పశువుల నుంచే ఎందుకొచ్చిందో వాళ్ళకి బోధపడడం లేదు. అప్పుడు ఆ మధ్యవర్తి ఆందోళనకారుల వినతి పత్రాన్ని వాళ్ళకి చూపించేడు. అందులో ఇలా ఉంది:

"ఇన్నేళ్ళుగా మా మెడలకి కాడి కట్టి దున్నించేరు. బళ్ళు లాగించేరు. గానుగలు ఆడించేరు. రిటైర్ అవగానే కబేళాలకి పంపేరు. ఇక మా ఆడవాళ్ళని పాడి కోసం వాడుకున్నప్పుడు మా బిడ్డలకి దక్కవలసిన పాలు దక్కకపోయినా భరించాం. ఎందుకు? మేం పశువులం గనక. ఇతరులకు ఉపయోగపడాలన్నదే మా జీవిత పరమార్థం అని మాకు తెలుసు గనక. కాని ఇప్పుడు మీ అకృత్యాలు మితి మీరిపోయాయి. ఇక సహించం. తక్కిన ప్రపంచం అంతా ప్రేమికుల దినంగా జరుపుకుంటున్న ఫిబ్రవరి 14న మీరు పశుకౌగిలి దినం పాటించమని ఆదేశాలు ఇచ్చారు. ఇక ప్రతీ వాడూ వచ్చి మమ్మల్ని వాటేసుకుంటాడన్నమాట. మీ మనుషులకి ఇంగిత జ్ఞానం పోయిందని అర్థం అవుతోంది. మేం పశువులమనుకున్నారా? మనుషులమనుకున్నారా? ఖబడ్దార్ ! మర్యాదగా వెంటనే ఆ దిక్కుమాలిన సర్క్యులర్ ని వెనక్కి తీసుకోండి."

కలెక్టర్ గారు వెంటనే ఆ వినతి పత్రాన్ని కేంద్ర పశు సంవర్ధక శాఖకి ఆగమేఘాల మీద పంపేడు. కాని ఆ మేఘాలు ఢిల్లీ వెళ్ళేలోపు గాలివాన వచ్చి చెదిరిపోయాయి.

ఆ రోజు ఫిబ్రవరి పదిహేను. ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. కాజువాలిటీ వార్డు ఇన్‌చార్జి రిపోర్టు తయారుచేసేడు. "పశు కౌగిలి దినం సందర్భంగా ఆ పశువులని ముందు నుంచి వాటేసుకోబోయి కొమ్ములు గుచ్చుకుని గాయపడినవారు మూడు వందల డెబ్బై మంది. వారిలో దాదాపు మూడు వందల మంది పరిస్థితి విషమంగా ఉంది. పక్కనుంచి పశుకౌగిలి కోసం ప్రయత్నించి ఆ పశువుల గిట్టల కింద నలిగి ఫ్రాక్చర్లు అయినవాళ్ళు ఆరు వందల తొంభై మంది, వారిలో ఎక్కువమందికి చెప్పరానిచోట్ల చితికిపోయి ట్రామా లోకి వెళ్ళిపోయారు. ఇక వెనకనుంచి వాటేసుకోబోయి ఆ పశువుల వెనక కాళ్ళు ఝాడించి తన్నిన కారణంగా మూతిపళ్ళు రాలిపోయినవారు రెండు వేలమందికి పైగానే ఉంటారు. ఇంకా ఎంతమంది బాధితులున్నారో తెలియదు." అని ఆ రిపోర్టులో ఉంది.

ఢిల్లీ లోని ఎయిమ్స్‌లో పశుకౌగిలి దినం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర వ్యవసాయ శాఖామాత్యుల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని టీవీ చానెళ్ళు బ్రేకింగ్ న్యూస్ ఇస్తున్నాయి.

"మమ్మల్ని బలవంతం చేసే మృగాళ్ళని ఏంచేయాలో ఇప్పుడు బాగా తెలిసింది" అని మహిళా లోకం యావత్తూ ముక్తకంఠంతో ప్రకటించింది.

తన శిష్య బృందాన్ని చుట్టూ కూచోబెట్టుకుని స్వామి అలౌకికానంద తీర్థులవారు "నోరూ వాయీ లేదని పశువులని చులకనగా చూడవద్దు. ఎవరితోనైనా పెట్టుకోవచ్చు గాని పశువులతో మాత్రం పెట్టుకోవద్దు" అని బోధ చేశారు.

★★★

"అవునవును...పశువులతో మాత్రం పెట్టుకోవద్దు...పంచరైపోతుంది. అయినా పశువులను ప్రేమగా, లాలనగా దగ్గరకు తీసుకోవడానికి ప్రత్యేకంగా ఒక రోజు కావాలా ఏంటి? ఆ పని ఎప్పుడైనా చేయొచ్చుకదా..!" అంటున్న నన్ను తట్టి మరీ నిద్ర లేపింది మా శ్రీమతి.

"ఏవండీ కలగంటున్నారా? ఆఖరికి మీరు కలవరించిందే జరిగిందండీ. కేంద్ర పశు సంవర్ధక శాఖ 'కౌ హగ్ డే' ఆలోచనను వెనక్కు తీసుకుందట..." అనడంతో "...అయితే కలలోలా ఎవరికీ ఏ గాయాలూ కావన్నమాట... హమ్మయ్య." అని ఊపిరి పీల్చుకున్నాను.

- సుబ్రమణ్యం

తప్పిపోయిన పిల్లల కోసం రైల్వే వెబ్‌సైట్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్: తప్పిపోయిన పిల్లల ఆచూకీ వివరాలను తెలుసుకొనేందుకు రైల్వే శాఖ ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసింది. ఇంటి నుండి పారిపోయిన, తప్పిపోయిన పిల్లల వివరాలను ఫోటోలతో సహా https://indinrailways.gov.in, Track child portal-3.0" అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో పొందుపరచారు. ఈ వెబ్‌సైట్‌ను ఆర్‌పిఎఫ్ పోలీసులు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 వారి సమన్వయంతో నిర్వహిస్తున్నారు.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Home Finance

నమోదిత కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బంద్రా-కుర్లా కాంప్లెక్స్, బంద్రా (ఈస్ట్), ముంబాయి-400051
కార్పోరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అందేరి కుర్లా రోడ్, అందేరి ఈస్ట్, ముంబాయి-400059
శాఖ కార్యాలయం: సుప్రియ టవర్స్, 1వ అంతస్తు, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002.

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ హోం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణప్రీత/సహా-రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం(రూ)	శాఖ పేరు
ఈ 16 లక్షల మందిలో 6.8 లక్షల మంది (43 శాతం మంది) ఒక్క తమిళనాడు రాష్ట్రంలోని ఫ్యాక్టరీలలోనే ఉపాధి పొందటం గమనార్హం. భారత్‌లోని పరిశ్రమలలో గల మొత్తం మహిళా శ్రామిక శక్తిలో దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లలోనే 72 శాతం మంది ఉన్నారు. ఉత్పాదక రంగంలో శ్రామిక శక్తి లింగ సమతుల్యతను నమోదు చేసిన రాష్ట్రంగా మణిపూర్ ఉన్నది. ఇక్కడ 50.8 శాతం మంది మహిళలు శ్రామిక శక్తిలో ఉన్నారు. ఆ తర్వాతి రాష్ట్రాల్లో కేరళ (45.5 శాతం), కర్నాటక (41.8 శాతం), తమిళనాడు (40.4 శాతం) లు ఉన్నాయి.

ఇక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం లింగ అసమతుల్యతను అధికంగా కలిగి ఉన్నది. ఇక్కడ కేవలం 2.9 శాతం మంది మహిళలు ఉత్పాదక యూనిట్లలో పని చేస్తున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ (4.7 శాతం), జమ్ముకాశ్మీర్ (5.5శాతం), పశ్చిమ బెంగాల్ (5.5 శాతం) ఉన్నాయి. దేశంలో పారిశ్రామికీకరణ అధికంగా కలిగి ఉన్న రాష్ట్రాల్లోనూ లింగ వివక్ష విస్తృతంగా ఉన్నది. మహారాష్ట్ర (12 శాతం), ఉత్తరప్రదేశ్ (5.7 శాతం), గుజరాత్ (6.8శాతం)లలో ఈ లింగ అంతరాలు ఎక్కువగా ఉన్నాయి.

వేతనాలలో అంతరాలు

పురుషులు, మహిళా కార్మికుల మధ్య వేతనాల్లోనూ అంతరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2019-20 ఏడాది సమాచారం చూసుకుంటే.. ఒక పురుష కార్మికుడు రూ.100 సంపాదిస్తే.. మహిళా కార్మికురాలి సంపాదన మాత్రం రూ.87.06 గా ఉన్నది. ఒక్క రోజుకు పురుష కార్మికుడు సగటున రూ.439 ఆర్జించగా.. మహిళా కార్మికురాలు రూ. 382 మాత్రమే గడించగలిగింది. పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలలో ఈ అంతరాలు అధికంగా ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో ఒక పురుషుడు రూ. 100 సంపాదిస్తే.. మహిళా కార్మికురాలు మాత్రం వరుసగా రూ. 74.1, రూ. 75.5, రూ. 78.4 మాత్రమే పొందగలగటం పరిశ్రమల్లో మహిళలు వివక్షకు గురవుతున్న విషయాన్ని వెల్లడిస్తున్నది.

పరిశ్రమల వారీగా మహిళా కార్మికులు

పరిశ్రమ	శాతం
దుస్తులు	31
ఇతరాలు	25
టెక్స్‌టైల్	15
ఆహార ఉత్పత్తులు	14
టొబాకో	8
తోలు మరియు దాని సంబంధితం	7



కోజికోడ్ మాజీ ఎమ్మెల్యే సిపి కుంజు కన్నుమూత

తిరువనంతపురం : సిపిఎం సీనియర్ నాయకులు, కోజికోడ్ మాజీ ఎమ్మెల్యే సిపి కుంజు (93) శుక్రవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోజికోడ్ సహకార ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 1987లో ముస్లిం లీగ్‌కు కంచుకోటగా ఉన్న కోజికోడ్‌లో భారీ మెజారిటీతో సిపి కుంజు తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టారు. ఎన్నికల వేదికపై ఉత్తమ వక్తగా నిలిచి సిపిఎం దీర్ఘకాల స్టార్ క్యాంపెయినర్‌గా సేవలందించారు. రాష్ట్ర, జాతీయ రాజకీయ పరిణామాలపై హాస్యభరితంగా ప్రసంగించగల చైతన్యవంతమైన వక్తగా ఆయన ప్రజాదరణ పొందారు. కోజికోడ్ కార్పొరేషన్ కౌన్సిలర్‌గా, సిపిఎం జిల్లా కమిటీ సభ్యునిగా, వక్ఫ్‌బోర్డు సభ్యునిగా, కెఎస్‌ఇబి సంప్రదింపుల కమిటీ సభ్యునిగా కూడా కుంజు సేవలందించారు. ఆయనకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. కుంజు కుమారుల్లో ఒకరైన సిపి ముసాఫిర్ అహ్మద్ ప్రస్తుతం కోజికోడ్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా పనిచేస్తున్నారు. కోజికోడ్ టౌన్‌హాల్‌లో ప్రజల సందర్శనార్థం కుంజు భౌతికకాయాన్ని ఉంచి అనంతరం శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో స్థానిక చర్చి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక సిపిఎం నాయకులు , అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు నివాళులర్పించారు.

కాశ్మీర్‌లో లిథియం నిక్షేపాలు

- దేశంలో తొలిసారి వెలుగులోకి...
- కేంద్ర గనుల శాఖ వెల్లడి

జమ్ముకాశ్మీర్ : బ్యాటరీలు, ఇతర విద్యుత్తు పరికరాల తయారీలో అత్యంత కీలకమైన లిథియం నిక్షేపాలు భారత్‌లో తొలిసారి భారీగా వెలుగు చూశాయి. జమ్ముకాశ్మీర్‌లో 59 లక్షల టన్నులు లిథియం రిజర్వులు వెలుగు చూసినట్లు కేంద్ర గనులశాఖ ప్రకటించింది.'జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తొలిసారి జమ్ముకాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలోని రియాసి జిల్లాలో సలాల్ హైమాన ప్రాంతంలో లిథియం నిల్వలు కనుగొంది' అని గనుల శాఖ ట్విట్టర్‌లో పేర్కొంది. దేశ వ్యాప్తంగా గనులశాఖ మొత్తం 51 ఖనిజ క్షేత్రాలను గుర్తించింది. వీటిల్లో మొత్తం 5 క్షేత్రాల్లో బంగారం నిల్వలను కనుగొన్నారు. మిగిలిన చోట్ల పొటాష్, మాలిబ్డినం, ఇతర ప్రాథమిక లోహాలను గుర్తించారు. జమ్ముకాశ్మీర్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఝూర్ఖండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల్లో ఇవి ఉన్నాయి. 2018-19 మధ్య నిర్వహించిన సర్వేల ఆధారంగా గుర్తించారు.

అదానికి మూడీస్ షాక్

(మొదటిపేజీ తరువాయి)

వెయిటేజీని తగ్గిస్తున్నట్లు పేర్కొంది.

ఎఫ్‌పిఒపై సెబీ దర్యాప్తు..!

అదాని ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పిఒ) ఉపసంహరణపై మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబీ నిఘా పెట్టినట్లు సమాచారం. అదాని ఎంటర్‌ప్రైజెస్ భారీగా పడిపోయిన సమయంలోనూ యాంకర్ ఇన్వెస్టర్లు, విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ముందుకు వచ్చారు. హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు అప్పటికే భారీగా పడిపోతున్న ఈ కంపెనీ షేర్లపై ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడం.. ఎఫ్‌పిఒ పూర్తి సబ్‌స్క్రిప్షన్ కావడం అనుమానస్పదంగా ఉంది. నిబంధనల ప్రకారం యాంకర్ ఇన్వెస్టర్లకు కంపెనీతో ఎటువంటి సంబంధం ఉండకూడదు. ఈ నిబంధన ఉల్లంఘన జరిగిందేమోనన్న అనుమానంతో సెబి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

నష్టాల్లోనే అదానీ షేర్లు..

ఎంఎస్‌సిఐ వెయిటేజీ తగ్గింపు, మూడీస్ పరపతి కోతతో అదానీ గ్రూపు కంపెనీల షేర్లపై మరింత అనిశ్చిత్తి చోటు చేసుకుంది. ఇప్పటికే ఈ సూచీలపై హిండెన్‌బర్గ్ ఒత్తిడి తీవ్రంగా ఉన్న విషయం తెలిసిందే. శుక్రవారం సెషన్‌లోనూ అదానీ ఎంటర్‌ప్రైజెస్ 3.78 శాతం పతనమై రూ.1,853 వద్ద ముగిసింది. అదాని పవర్ 4.97 శాతం, అదాని విల్మర్ 0.95 శాతం, ఎన్‌డిటివి 3.65 శాతం చొప్పున నష్టాలు చవి చూశాయి.

అధికారం కోసం బిజెపి నీచపుటెత్తుగడలు

- ప్రజలు స్వేచ్ఛగా ఓటేసే వాతావరణం ఇసి కల్పించాలి
- ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి
- మీడియా గోష్టిలో సీతారాం ఏచూరి



అగర్తలా : త్రిపురలో ఈ నెల 16న జరగనున్న ఎన్నికల్లో గెలుపొందేందుకు ధన, అంగ బలాన్ని ఉపయోగించడంతో సహా అన్ని నీచపుటెత్తుగడలకు బిజెపి పాల్పడుతోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి శుక్రవారం విమర్శించారు. త్రిపుర పర్యటనలో భాగంగా అగర్తలలో శుక్రవారం నాడు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రిపుర ప్రజలు తమని అధికారం నుండి తొలగిస్తారని గ్రహించిన బిజెపి ఎలాగైనా అధికారంలో కొనసాగేందుకుగానూ ఈ ఎత్తుగడలను ప్రయోగిస్తోందని విమర్శించారు. బిజెపి, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వంతో కూడిన కూటమి పోలీసులు, ఇతర అధికారులతో కలిసి ఎన్నికల్లో రిగ్గింగ్ చేసేందుకు తీవ్రంగా కుట్ర పన్నిందని విమర్శించారు. పోలింగ్‌కు మూడు రోజులు ముందు బిజెపి, శాంతి భద్రతల సమస్యలను సృష్టించే అవకాశాలు వున్నాయంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఎవరు గెలుపొందుతారు, ఎవరు ఓడిపోతారనేది ఇక్కడ ప్రశ్న కాదని, రాష్ట్రంలో అవినీతి, భయోత్పాతంతో కూడిన పాలన నెలకొన్న నేపథ్యంలో ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన పునరుద్ధరించాల్సిన అవసరముందని ఏచూరి పేర్కొన్నారు. ఓటు వేసే ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షానికి మద్దతునిచ్చే వారికి బిజెపి,వారి గూండాల నుండి ఇప్పటికే బెదిరింపులు, అడ్డగింపులు మొదలయ్యాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నిర్భయంగా బయటకు వచ్చి ఓటు వేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. త్రిపురలో సిపిఎం అభ్యర్థుల తరపున ప్రచారం నిమిత్తం ఆయన గత కొద్ది రోజులుగా ఇక్కడే వున్నారు. బిజెపి ఘోరంగా అధికారాల దుర్వినియోగానికి పాల్పడుతోందని అంటూ ఈ దుర్వినియోగాన్ని, ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనను తక్షణమే నిలుపుచేయాలని ఏచూరి కోరారు. కేంద్ర సాయుధ బలగాల పర్యవేక్షణలో ఎన్నికలు జరగాలని డిమాండ్ చేశారు. అక్కడికక్కడే పరిస్థితులను బట్టి అవసరమైన చర్యలు తీసుకునే అధికారాన్ని వారికి కల్పించాలని కోరారు.

ప్రస్తుతం త్రిపురలో ప్రజాస్వామిక వాతావరణం లేదని రాష్ట్ర సిపిఎం కార్యదర్శి జితేంద్ర చౌదరి అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా బిజెపి 299 హామీలు చేసిందని, ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. గురువారం బిజెపి అధ్యక్షుడు నడ్డా 24 వాగ్దానాలను ప్రకటించారని, వాటిలో చాలావరకు అవాస్తవికమైనవేనని అన్నారు. ప్రజలను వెర్రివాళ్ళను చేయడంలో బిజెపికి నైపుణ్యం వుందని ఆయన వ్యాఖ్యానించారు. బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో నిరుద్యోగం, ఉపాధి కల్పన, ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాల గురించి అస్సలు ప్రస్తావించలేదని విమర్శించారు.

సరిహద్దు బలగాల స్థానంలో గుజరాత్, అస్సాం పోలీసులా?

- త్రిపుర ఎన్నికల వేళ మార్పుపై సిపిఎం ఆందోళన


నీలోత్పల్ బసు

న్యూఢిల్లీ : త్రిపుర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు భద్రత బలగాల స్థానంలో గుజరాత్, అస్సాం పోలీసులను మోహరింపజేయడంపై సిపిఎం ఆందోళన వ్యక్తం చేసింది. వీరిని వెనక్కి పంపి సరిహద్దు భద్రత విధుల్లో కేంద్ర పారా మిలటరీ బలగాలను మాత్రమే మొహరించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ మేరకు ఇసికి ఒక లేఖ రాశారు. త్రిపుర ఎన్నికలకు పోస్టల్ బ్యాలెట్‌ను నిర్వహించడంలో తలెత్తిన ఆందోళనకర పరిస్థితులను కూడా సిపిఎం ఇసి దృష్టికి తీసుకువచ్చింది. తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్న బిశాల్‌ఘర్ ఎస్‌డిపిఒ రాహుల్ దాస్‌ను తొలగించాలని, ఆయనపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయాలని డిమాండ్ చేసింది. ఎలాంటి భయోత్పాతం లేకుండా త్రిపురలో స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల కమిషన్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. గతనెల 19న ఇసితో జరిగిన సమావేశంలో దీనిపై మరోసారి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న కొన్ని పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఒక రాష్ట్ర ఎన్నికలకు ఇతర రాష్ట్రాల పోలీసు బలగాలను మోహరించడం అసాధారణమని ఆ లేఖ పేర్కొంది. అస్సాం ముఖ్యమంత్రి వాస్తవానికి త్రిపురలో మకాం వేసారని, అందువల్ల ఆ రాష్ట్ర పోలీసుల మోహరింపు అనేది తీవ్రంగా ఆందోళన కలిగిస్తోందన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ నిర్వహణలో అవకతవకలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఇందుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి వీలుగా త్రిపుర రాష్ట్ర కార్యదర్శి రాసిన లేఖను కూడా నీలోత్పల్ బసు ఈ లేఖతో జతపరిచారు. అత్యవసర ప్రాతిపదికన కమిషన్ ఈ విషయాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు నీలోత్పల్ బసు తెలిపారు.



పిఎఫ్ పెన్షన్‌పై 'సుప్రీం' తీర్పును అమలు చేయాలి

- పార్లమెంటులో వామపక్ష ఎంపిల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జీతానికి అనుగుణంగా పిఎఫ్ పింఛన్‌ను ఎక్కువగా చెల్లించాలన్న సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని సిపిఎం పార్లమెంటరీ పార్టీ నేత ఎలమరం కరీం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంటు ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద వామపక్ష ఎంపిలు ధర్నాకు దిగారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని, కార్మిక సంఘాలు చాలా కాలంగా కోరుతున్న కనీస పెన్షన్‌ను రూ.9 వేలకు పెంచాలని ఎంపిలు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎలమరం కరీం మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని అన్నారు. దాదాపు 27 లక్షల మంది పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం క్రూరమైన విధానాలను అవలంభిస్తోందని ధ్వజమెత్తారు. దేశానికి నిజమైన సంపద సృష్టికర్తలైన కార్మికుల పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దారుణమన్నారు. ఆందోళనలో సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, వి శివదాసన్, ఎఎ రహీం, ఎఎం ఆరిఫ్, పిఆర్ నటరాజన్, బికాష్ రంజన్ భట్టాచార్య, సిపిఐ ఎంపిలు బినయ్ విశ్వం, పి సంతోష్ కుమార్, కేరళ కాంగ్రెస్ ఎంపి జోస్ కె మణి పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై 'నిర్మల' ఎదురుదాడి

- దేశ ఆర్థిక అవసరాలను సమతుల్యం చేసే బడ్జెట్
- కొత్త పన్ను విధానంతో ప్రజల చేతుల్లో అధిక ఆదాయం
- బడ్జెట్‌పై చర్చకు ఆర్థిక మంత్రి సమాధానం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఎదురుదాడికి దిగారు. లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చ ముగిసిన తరువాత శుక్రవారం నిర్మలా సీతారామన్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పకుండా, ఎదురుదాడికి దిగారు. ఆహార సబ్సిడీల్లో కోత విధించారన్న ప్రతిపక్షాల ఆరోపణల పట్ల కూడా ఆమె స్పందించారు. ప్రతిపక్షాల వాదనల్లో పస లేదని, తాము ఆహార సబ్సిడీలను రూ.1.97 లక్షల కోట్లతో రెట్టింపు చేశామని స్పష్టం చేశారు. 2023-24లోనూ ఇదే ఒరవడి కొనసాగుతుందని అన్నారు.

కాంగ్రెస్ చేస్తున్న అవినీతి ఆరోపణలకు ఘాటుగా స్పందించారు. 'అవినీతి గురించి కాంగ్రెస్ మాట్లాడుతుండటం ఆశ్చర్యంగా ఉంది. మీరు మీ నోళ్లను డెటాల్తో శుభ్రం చేసుకోండి భయ్యా. ఒకవేళ అలా చేసుకున్నా మీ నోళ్ల శుభ్రం కావు' అంటూ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. కొన్ని నెలల కిందట హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే పెట్రోల్ ధరలపై వ్యాట్ పెంచేసిందని నిర్మలా సీతారామన్ దుయ్యబట్టారు. దీంతో అక్కడ ఇంధన ధరలు పెరిగాయన్నారు. 'కాంగ్రెస్ సంప్రదాయం ఇదే. ఆరోపణలు చేస్తారు. సభ నుంచి వాకౌట్ చేస్తారు. అంతేగానీ ఎవరి మాటా వినరు' అంటూ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ బడ్జెట్ ప్రసంగంలో తప్పుల గురించి కూడా నిర్మలమ్మ ప్రస్తావించారు.'రాజస్థాన్ కష్టాల్లో ఉంది. తప్పులు ఎవరైనా చేస్తారు. కానీ గతేడాది బడ్జెట్ చదవాల్సిన పరిస్థితి ఎవరికీ రాకుండా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అంటూ వ్యంగ్యంగా అన్నారు.

దేశ ఆర్థిక అవసరాలను సమతుల్యం చేసే బడ్జెట్ అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కొత్త పన్ను విధానం ప్రజల చేతుల్లో అధిక ఆదాయాన్ని ఉంచుతుందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతోందని అన్నారు. ఆర్థిక వ్యవస్థకు కొత్త రెక్కలు తొడిగేందుకు మూలధన వ్యయం పెంపు మార్గాన్ని ఎంచుకున్నామని వివరించారు. చైనాలో కరోనా సంక్షోభం వల్ల అంతర్జాతీయంగా వస్తు ధరలు పెరిగాయని, ఓవైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరుగుతోందని, ఇలాంటి పరిస్థితులు, అంతర్జాతీయ ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నడుమ సంక్షోభం నుంచి కోలుకుంటూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని వివరించారు. నూతన ఆదాయ పన్ను వ్యవస్థలో ఎలాంటి షరతులూ లేని రిబేట్ పెంపుదల నిర్ణయం తీసుకున్నామని సభకు వివరించారు.

ఉభయ సభల్లో ప్రతిపక్షాలు వాకౌట్

పార్లమెంటు ఉభయ సభల్లో శుక్రవారం ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే గురువారం చేసిన కొన్ని వ్యాఖ్యలపై ఛైర్మన్ జగదీప్ సింగ్ ధన్‌ఖర్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ప్రతిపక్ష ఎంపిలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. శుక్రవారం ఉదయం రాజ్యసభలో గందరగోళం మధ్య, కార్యక్రమాల సమయంలో జరిగిన ప్రతి ఉల్లంఘననూ లోతుగా పరిశీలిస్తానని ధన్‌ఖర్ అన్నారు. 'రెండు వైపుల నుంచి జరిగే ప్రతి ఉల్లంఘనలపై నా లోతైన పరిశీలన ఉంటుంది' అని ఆయన అన్నారు. మదురైలోని ఎయిమ్స్ ఏర్పాటుపై వాదనకు దిగడంతో లోక్‌సభలో కాంగ్రెస్, డిఎంకె, సిపిఎం, సిపిఐ ఎంపిలు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాకు వ్యతిరేకంగా వాకౌట్ చేశారు.

కాంగ్రెస్ ఎంపి రజనీ పాటిల్ సస్పెండ్

సభలో వీడియో రికార్డు చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపి రజనీ పాటిల్‌ను సస్పెండ్ చేశారు. బడ్జెట్ సెషన్ నుంచి కమిటీ నివేదికకు లోబడి కాంగ్రెస్‌కు చెందిన రజనీ పాటిల్ రాజ్యసభ నుంచి సస్పెండ్ అయ్యారు. అవమానకర రీతిలో సస్పెన్షన్ జరిగిందని, ఎంపికి స్పష్టత ఇచ్చే అవకాశం లేదని ఎస్‌పి ఎంపి జయా బచ్చన్ అన్నారు.


101 గంటల తర్వాత ప్రాణాలతో బయటపడ్డ బాలుడు

అపర మృత్యుంజయులు !

101 గంటల తర్వాత బయటకు

అంకారా : టర్కీ, సిరియాల్లో భీకరమైన భూ కంపం సంభవించిన నాలుగు రోజులు గడిచింది. అప్పటి నుండి శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు సహాయక సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తూనే వున్నారు. తాజాగా 101 గంటల పాటు శిథిలాల్లో చిక్కుకుపోయిన ఆరుగురు సభ్యులున్న కుటుంబం మృత్యువును ఎదిరించి మరీ సజీంగా బయటపడ్డారు. కుప్పకూలిన భవన శిథిలాల్లోనే ఒక చిన్న ప్రాంతంలో కలిసికట్టుగా వుండి ప్రాణాలు నిలుపుకున్న ఆరుగురు వ్యక్తులను విజయవంతంగా వెలికితీసినట్లు సహాయక కార్యకర్త మురత్ బైగల్ మీడియాకు తెలిపారు. అయితే, దిగజారుతున్న ఉష్ణోగ్రతల కారణంగా శిథిలాల్లో చిక్కుకుపోయినవారు జీవించే అవకాశాలు తగ్గుతాయని సహాయక సిబ్బంది పేర్కొంటున్నారు.

22 వేలు దాటిన మృతులు

టర్కీ, సిరియాల్లో భూకంప మృతుల సంఖ్య 22 వేలు దాటింది. టర్కీలో మృతుల సంఖ్య 18,991కి పెరిగిందని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ప్రకటించారు. సిరియాలో ప్రతిపక్షాల అదుపులో వున్న ప్రాంతాల్లో మృతుల సంఖ్య 2,037కి చేరగా, ప్రభుత్వ నియంత్రణలోని ప్రాంతాల్లో మరణించిన వారి సంఖ్య 1340గా వుందని ఆ దేశ రక్షణ వర్గాలు తెలిపాయి.

ఆపరేషన్ దోస్త్..

టర్కీ, సిరియాలకు ప్రపంచ దేశాలతో పాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ఆర్థిక సాయం ప్రకటించాయి. భారత్ 'ఆపరేషన్ దోస్త్' ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్ కింద భారీగా రెస్క్యూ, వైద్య బృందాలతో పాటు ఇతర సామగ్రిని పంపింది. భారత సైన్యం హతేయిలో అత్యవసర వార్డుని ఏర్పాటు చేసింది. అమెరికా 85 మిలియన్ డాలర్ల ప్యాకేజీని ప్రకటించింది. టర్కీ, సిరియాలకు సిరియాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) అండగా నిలిచింది. డబ్ల్యుహెచ్ఒ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ సిరియాలో పర్యటించనున్నారు.

పరిపూర్ణంగా సుప్రీంకోర్టు నియామకాలు



- ఇద్దరు హైకోర్టు జడ్జీలకు పదోన్నతి
- 34కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య

న్యూఢిల్లీ : ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు శుక్రవారం నాడు పదోన్నతి కల్పించడంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాలు పరిపూర్ణమయ్యాయి. అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేష్ బిందాల్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్‌లను సుప్రీం న్యాయమూర్తులుగా రాష్ట్రపతి నియమించారు. దీంతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 34 కాగా పూర్తి స్థాయిలో నియామకాలు జరిగినట్లు అయ్యింది. రాజ్యాంగం నిబంధనల మేరకు ఈ నియామకాలు జరిగాయని న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ట్వీట్ చేశారు. జనవరి 31న సుప్రీం కోర్టు కొలీజియం వీరి పేర్లను సిఫార్సు చేసింది. కాగా, పూర్తి స్థాయి సామర్థ్యంతో చంద్రచూడ్ మొదటిసారిగా విధులు నిర్వహించనున్నారు. ఈ నెల 6న కొత్తగా ఐదుగురు న్యాయమూర్తులను సుప్రీం నియమించింది.

న్యాయ సమీక్ష పరిధిలోకి రాదు..

కొలీజియం ఆమోదించిన ఒక అభ్యర్థిని రాజ్యంగ కోర్టులో న్యాయమూర్తిగా నియమించిన తర్వాత ఇక ఆ న్యాయమూర్తి నియామకం న్యాయ సమీక్ష పరిధిలోకి రాదని సుప్రీం కోర్టు శుక్రవారం రూలింగ్ ఇచ్చింది. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా విక్టోరియా గౌరీ నియామకం చెల్లదని ప్రకటించాలని కోరుతూ పలు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో సుప్రీం ఈ రూలింగ్ ఇచ్చింది. "రాజ్యాంగ ధర్మాసనం తీర్పులను పరిశీలించాం, అభ్యర్థి అర్హతను మనం పరిశీలించలేం" అని ప్రత్యేక బెంచ్‌కు నాయకత్వం వహిస్తున్న జస్టిస్ సంజయ్ ఖన్నా చెప్పారు.

గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని కేంద్ర మంత్రులకు ఆహ్వానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


కేంద్ర మంత్రి వికె సింగ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న బుగ్గన, అమర్‌నాథ్

విశాఖపట్నంలో మార్చి 3, 4న జరిగే ఏపి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు రావాలని కేంద్ర మంత్రులను రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, గుడివాడ అమర్‌నాథ్ ఆహ్వానించారు. శుక్రవారం కేంద్ర మంత్రులు జ్యోతి రాధిత్య సింధియా, ప్రహ్లాద్ జోషి, వికె సింగ్, ఆర్‌కె సింగ్‌ను కలిసి సమ్మిట్‌కు ఆహ్వానించారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

విశాఖ రైల్వే జోన్ కోసం రూ.7.29 లక్షలే ఖర్చు

- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైల్వే జోన్ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయంలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అయితే రైల్వే జోన్ హెడ్ క్వార్టర్స్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఇప్పటికే గుర్తించామని తెలిపారు. దక్షిణ కోస్తా రైల్వే ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు రూ.106.89 కోట్లు అంచనా వ్యయం అనుమతించినట్లు చెప్పారు. జోన్ ఏర్పాటు ఖర్చులపైనా కేంద్ర మంత్రి అరకొర సమాధానమే చెప్పారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుపై రాజ్యసభలో వైసిపి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌పై అతి తక్కువ ఖర్చు అవుతుందని, ఈ ప్రాజెక్టు కోసం ఈ ఆర్థిక సంవత్సరం (2022 - 23)లో చేసిన ఖర్చు కేవలం రూ.7.29 లక్షలేనని చెప్పుకొచ్చారు. భూ సర్వే, హెడ్ క్వార్టర్స్ కాంప్లెక్స్ లే అవుట్, నివాస కాలనీ సహా నిర్మాణ కార్యక్రమాలను చేపట్టాలని రైల్వే శాఖను కోరినట్లు పేర్కొన్నారు. భవనాల నమూనా ప్రాథమికంగా సిద్ధం చేశారన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా ఇప్పటికే సంబంధిత కమిటీ సమర్పించిందని తెలిపారు.

రాష్ట్ర వాటా రూ.3,723 కోట్లు చెల్లించాలి

ఎపిలో రైల్వే ప్రాజెక్టుల నిమిత్తం రాష్ట్ర వాటా రూ.3,723 కోట్లు చెల్లించాల్సి ఉందని వైసిపి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజ్యసభలో లలిఖితపూర్వకంగా తెలిపారు. మొత్తంగా ఎపిలో రూ.17,073 కోట్లు విలువైన ఏడు ప్రాజెక్టులు చేపట్టామని పేర్కొన్నారు.

ఎయిమ్స్‌లలో 22,011 పోస్టులు ఖాళీ

దేశంలోని 20 ఎయిమ్స్‌లలో 22,011 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవర్ తెలిపారు. ఒక ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 22,011 ఖాళీ పోస్టుల్లో 19,914 నాన్ టీచింగ్, 2,097 టీచింగ్ పోస్టులు ఉన్నాయని అన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో 425 నాన్ టీచింగ్, 68 టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

విదేశాల్లో 28,485 మంది మృతి

విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు గత మూడేళ్లలో 28,485 మంది మరణించినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి మురళీధరన్ తెలిపారు. లోక్‌సభలో వైసిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల్లో గడిచిన మూడేళ్లలో 24,278 మంది సహజ మరణం పొందారని, ట్రాఫిక్ ప్రమాదాల వల్ల 1,622 మంది మరణించారని, 686 మంది వృత్తి పరమైన ప్రమాదాల వల్ల, 1,763 మంది ఆత్మహత్యల వల్ల, 136 మంది హింస, హత్యల కారణాల వల్ల మరణించారని వెల్లడించారు.

1,98,208 పోస్కో కేసులు పెండింగ్

దేశంలో 1,98,208 పోస్కో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022 డిసెంబరు 31 నాటికి ఎపిలో 7,328, తెలంగాణలో 7,544 పోస్కో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

- దేశంలో 5,552,686 వినియోగదారుల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర వినియోగదారు వ్యవహారాల మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు.

రైళ్లలో అత్యవసర మందులతో ఫస్ట్ ఎయిడ్

రైలు ప్రయాణికులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు దేశంలోని అన్ని రైళ్లు, రైల్వే స్టేషన్లలో అత్యవసర మందులు, మెడికల్ సామగ్రి, ఆక్సిజన్ సిలిండర్ కలిగిన మెడికల్ బాక్స్‌లను ఏర్పాటు చేసినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రాజ్యసభలో వైసిపి ఎంపి వి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులకు ఫస్ట్ ఎయిడ్ సేవలు చేసేలా ఫ్రంట్ లైన్ సిబ్బంది, ట్రైన్ టికెట్ ఎగ్జామినర్ (టిటిఇ), ట్రైన్ గార్డులు, సూపరింటెండ్లు, స్టేషన్ మాస్టర్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

బిఐఎస్ ఆమోదం లేని బొమ్మల తయారీపై చర్యలు

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) ఆమోదం లేకుండా బొమ్మలు తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వినియోగదారుల వ్యవహారాల సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి చెప్పారు. రాజ్యసభలో విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. బిఐఎస్ ఆమోదం లేకుండా బొమ్మలు తయారు చేస్తున్న వారిపై తరచుగా దాడులు నిర్వహిస్తూ జరిమానాలు విధిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఢిల్లీ వెలుపల బెంచ్‌లు సమర్థనీయం కాదు

ఢిల్లీ వెలుపల సుప్రీం కోర్టు బెంచ్‌లు సమర్థనీయం కాదని సుప్రీం కోర్టు పేర్కొందని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. 2018 ఫిబ్రవరి 18న నిర్వహించిన ఫుల్‌కోర్టు సమావేశంలో ఈ మేరకు తెలిపిందని వైసిపి ఎంపి గోరంట్ల మాధవ్ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. నేషనల్ కోర్ట్ ఆఫ్ అప్పీల్ ఏర్పాటు అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి సుప్పీం కోర్టు రిఫర్ చేసిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

2020 నుంచి నిధులు విడుదల లేదు

ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 14 ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టులకు 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి 2022 డిసెంబరు 31 వరకూ నిధులేమీ విడుదల చేయలేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజు తెలిపారు. 2019-20లో రూ.1.8 కోట్లు విడుదల చేసినట్లు వైసిపి ఎంపి మార్గాని భరత్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

మంగళగిరిలోనూ కేన్సర్ చికిత్స సదుపాయం

మంగళగిరి, బిబి నగర్ సహా 22 నూతన ఎయిమ్స్‌లలోనూ కేన్సర్ చికిత్స సదుపాయానికి అనుమతించామని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు. వైసిపి ఎంపిలు ఎంవివి సత్యనారాయణ, పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.





మీకోసం


ప్రెషర్ కుక్కర్ గ్యాస్కట్ వదులైతే దాన్ని మూడురోజులు ఫ్రిజ్‌లో ఉంచితే సరి.

జీవన సౌరభం

కేవలం విజయాల నుంచే కాదు, అపజయాల నుంచీ ఎదగడం నేర్చుకోవాలి.

JEEVANA జీవన the family

రాజు గారికి మూలిక




చంద్రకోట రాజ్యాన్ని వెంకటవర్మ అనే రాజు పరిపాలిస్తున్నాడు. అతడికి రాచపుండు పుట్టింది. అది తగ్గాలంటే విరుక్రాట పర్వతంలో ఉన్న సంజీవని మూలిక కావాలి. ఆ మూలిక పర్వతం మధ్యలో ఉంది. ఎవరైనా పర్వతంలోకి వెళ్ళి, ప్రాణాలతో తిరిగి వచ్చిన దాఖలాలు లేవు. ఆ పర్వతానికి వెళితే క్రూర మృగాలు చంపుతాయని అందరికీ భయం! ఎలాగైనా తండ్రిని బతికించుకోవాలని వెంకటవర్మ నలుగురు కుమారులు సైన్యంతో అడవిలోకి కొద్ది దూరం వెళ్ళి, పులుల అరుపులకు భయపడి వెనుదిరిగారు. 'పర్వతం మొదలు నుంచి చెట్లన్నీ నరికేయండి. కనిపించిన క్రూరమృగాలను చంపి, సంజీవని మూలిక తీసుకురండి' అని మహామంత్రి ఆనందుడు సైన్యానికి చెప్పాడు.

తరువాత వారం రోజులకు తర్వాత వైద్యులు సంజీవని మూలికతో వచ్చి, మహారాజు పుండుపై కట్టుకట్టారు. కొద్ది రోజుల్లో మహారాజు పూర్తి ఆరోగ్యవంతుడయ్యాడు. పర్వతంపై చెట్లు లేకుండా చేసి తాను ప్రాణం పోసుకున్నానని బాధపడ్డాడు. కొన్ని వారాలకు విరుక్రాట పర్వతం వద్దకు వెళ్ళాడు. అయితే, ఎప్పటిలాగానే ఉంది. మహామంత్రి ఆనందుడు వైపు చూసి ఏం జరిగిందని అడిగాడు. "సంజీవని మూలిక కోసం చెట్లు నరికేయడానికి సైన్యం వెళ్ళితే, వీర్రాజు అనే కోయ యువకుడు వచ్చాడు. 'చెట్లు నరికివేస్తే మా బతుకుదెరువు పోతుంది' అని ప్రాధేయపడ్డాడు. తాను సంజీవని మూలిక తెస్తానని వెళ్ళి, వారం రోజుల్లో సంజీవని మూలిక తెచ్చి ఇచ్చాడు. క్రూర మృగాల దాడిలో తీవ్రంగా గాయపడి, ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నాడ"ని ఆనందుడు తెలిపాడు. మహారాజు వెంటనే కోయగూడెం వెళ్లి, వీర్రాజును పరామర్శించాడు. ఆస్థాన వైద్యుల చేత చికిత్స చేయించాడు. ఆ రోజు నుంచి విరుక్రాట పర్వతంపై పూర్తి అధికారం కోయజాతికి చెందుతుందని ప్రకటించి, సంతోషంగా రాజమందిరానికి చేరుకున్నాడు.

- ఉండ్రాళ్ళ రాజేశం
99669 46084

చుక్కలు కలపండి

చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.



నేను గీసిన బొమ్మ





-వుటుకూరు రోషిత,
6వ తరగతి,
ఐడిపిఎస్,
మదనపల్లి,
చిత్తూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నాన్న కల నెరవేర్చాలని ...

డాక్టరు, కలెక్టరు, జడ్జి, టీచర్, న్యాయవాది, పైలట్ ఇలా ఆడపిల్లలు ఏ రంగంలో రాణిస్తున్నా అది వారి అదనపు గౌరవంగా భావించేవారు చాలామంది ఉంటారు. అదే ఆడపిల్ల ఆటలవైపు రాణిస్తుంటే మాత్రం మగరాయుడిలా ఆ బట్టలేంటి.. ఆ గెంతులేంటి.. అనేవాళ్లే ఎక్కువ. ప్రతి మహిళా క్రీడాకారిణి ఏదో ఒక సందర్భంలో ఇటువంటి సూటిపోటు మాటలు ఎదుర్కొనే ఉంటారు. అయితే ఎన్ని సవాళ్లు ఎదురైనా.. వాటన్నింటినీ అధిగమిస్తూ ఒక్కో మెట్టూ పైకెక్కుతున్న మహిళా క్రీడాకారిణులు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆ జాబితాలో మన విశాఖ అమ్మాయి ఎండి షబ్నమ్ పేరు చిరస్థాయిగా నిలిచిపోనుంది. ఇటీవల జరిగిన అండర్-19 విభాగంలో మన మహిళా క్రికెటర్లు ప్రపంచ విజేతలుగా విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆ బృందంలో చురుకైన పాత్ర పోషించిన షబ్నమ్ తన క్రీడా ప్రయాణం గురించి అనేక విషయాలు ముచ్చటించారు.



షబ్నమ్ తల్లిదండ్రులు షకిల్, ఈశ్వరమ్మ నేవీలో విధులు నిర్వహిస్తున్నారు. 15 ఏళ్ల షబ్నమ్ 8 ఏళ్ల నుండే క్రికెట్ ఆడడం మొదలుపెట్టింది. గంటకు 110 కిలోమీటర్ల వేగంతో బంతిని కొడుతూ ఫాస్ట్ బౌలర్‌గా రాణిస్తోంది. క్రికెట్‌పై ఆసక్తి కలగడంపై మాట్లాడుతూ 'నాన్న క్రికెటర్. రంజీ ప్లేయర్స్‌తో కూడా ఆడారు. ఇండియన్ జెర్సీ వేసుకోవాలని కలలుగన్నారు. కాని అది నెరవేరలేదు. నాన్న కలను నెరవేర్చాలని నేను, మా చెల్లి ప్రయత్నిస్తున్నాం. నా తొలి కోచ్ మా నాన్నే. ఆయన ఆటను చూస్తూ పెరిగిన నాకు క్రికెట్‌పై ఆసక్తి పెరిగింది. నాన్న కలను నెరవేర్చడమే నా ధ్యేయం' అంటోన్న షబ్నమ్ చెల్లి షహజాన్ బేగం కూడా అండర్-15 కేటగిరీలో ప్రతిభ చూపుతోంది.

'విశాఖ అకాడెమీలో మొదటి రోజు నేను మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు ఒకేసారి అబ్బాయి, అమ్మాయి బ్యాటింగ్ చేస్తున్నారు. అప్పుడు మా కోచ్ 'ఆ అబ్బాయి బ్యాటింగ్ ఎలా చేస్తున్నాడో జాగ్రత్తగా చూడు. అది నేర్చుకో.. అని చెప్పారు. అప్పుడు 'నేను అమ్మాయినే చూస్తాను. ఆమె నుండే నేర్చుకుంటాను' అని సమాధానం చెప్పాను అంటున్న షబ్నమ్ విశాఖ ఎన్ఎడి అకాడెమీలో తొలి రోజు 2015 డిసెంబరు 19న ఎదురైన అనుభవం గురించి చెప్పుకొచ్చింది. 'కోచ్ నాగార్జున సార్ అంటే నాకు ఎంతో అభిమానం. 'నేను మొదట సరదా కోసమే క్రికెట్ ఆడడం మొదలుపెట్టాను. కాని మా అకాడెమీలో చాలా మంది అమ్మాయిలు ఆడేవారు. వారందరినీ చూసి నా కెరియర్‌ను సీరియస్‌గా నిర్ణయించుకున్నాను' అంటోంది.

తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగం చేస్తూ తీరిక లేకుండా గడుపుతున్నా పిల్లలిద్దరినీ క్రికెట్ వైపు ప్రోత్సహించడంలో మాత్రం వెనుకడుగు వేయలేదు. ముఖ్యంగా పిల్లలపై ఒత్తిడి తీసుకురాలేదు. అది వారి చాయిస్‌కే వదిలేశారు. 'మేం మొదటినుండీ పిల్లలు ఏ రంగంలో రాణించాలనుకున్నా మా పూర్తి మద్దతు ఇవ్వాలనుకున్నాం. కాని అనుకోకుండా ఇద్దరూ వాళ్ల నాన్నకు ఇష్టమైన క్రికెట్‌లోనే రాణిస్తున్నారు' అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు షబ్నమ్ తల్లి ఈశ్వరమ్మ.

అమ్మను చూసి నేర్చుకున్నాం..

'ఉదయం అమ్మ ఎప్పుడు నిద్ర లేస్తుందో తెలియదు. మేము 5:30 గంటలకు కోచింగ్‌కు వెళ్లిపోవాలి. అప్పటికే మాకేం కావాలో సిద్ధం చేస్తుంది. తను 8 గంటలకు ఆఫీసుకు వెళుతుంది. సాయంత్రమే ఇంటికి తిరిగివస్తుంది. ఈ లోపు మాకు కావాల్సినవన్నీ సమకూర్చి పెడుతుంది. క్షణం విరామం లేకుండా పని చేస్తున్నా ఎప్పుడూ విసుక్కునేది కాదు. అమ్మ నుండి మేం సమయపాలన ఎలా చేసుకోవాలో తెలుసుకున్నాం' అంటూ అమ్మ గురించి ఎంతో గొప్పగా చెప్పింది షబ్నమ్.

ఆడపిల్లలను గడపదాటి బయటికి పంపాలంటే తల్లిదండ్రులు ఎంతో అభద్రతకు గురవుతారు. కాని షబ్నమ్ తల్లిదండ్రులు అలా కాదు. తన తొలి ప్రయాణం బెంగళూరు మ్యాచ్‌కు ఒక్కత్తే వెళ్లాలనుకున్నప్పుడు ఎదురైన అనుభవం గురించి చెబుతూ.. 'బెంగళూరు ఒక్కదాన్నే ప్రయాణించాల్సి వచ్చినప్పుడు కొంచెం భయమేసింది. కాని నాన్న 'ఎప్పుడో ఒకప్పుడు నువ్వు మొదటిసారే ప్రయాణించాలి. అది ఇప్పుడే అనుకుని వెళ్లు. నీ ప్రతి ప్రయాణం ఒంటరిగానే మొదలవుతుంది. అని ధైర్యం చెప్పార'ని ఆనాటి సంగతులు గుర్తుచేసుకుంది.



'అమ్మాయిని ఎందుకు ఆడిస్తున్నారు? చదివించండి.. ఆటలకు పంపడమేంటన్న' సూటిపోటి మాటలు షబ్నమ్‌కు కూడా ఎదురయ్యాయి. ఆ మాటలకు నిరుత్సాహపడకుండా 'ఆట ఆడి చూపించు. అదే ఆ మాటలకు సమాధానం చెబుతుంద'ని నాన్న ఎంతో ప్రోత్సహించారని, ఇప్పుడు అది నిజమైంద'ని షబ్నమ్ సంతోషంగా చెబుతోంది.

ప్రపంచకప్ అనుభవాలు..

'ప్రపంచకప్‌కు ఎంపికైన బృందంలో నేను అందరికంటే చిన్నదాన్ని. అలాగే మొత్తం సభ్యుల్లో 16 మందికి ఇది తొలి వరల్డ్ మ్యాచ్. దీంతో ఎలా నడుచుకోవాలి?, ఏం మాట్లాడాలి? వంటి విషయాలేవీ అర్థమయ్యేవి కావు. పైగా మాలో ఎవరికీ ఒకరి గురించి మరొకరికి తెలియదు. ఆ వాతావరణం చాలా భిన్నంగా ఉండేది. నాకు అలా ఉండడం ఇష్టం ఉండదు. అందుకే మా అందరి మధ్య సమన్వయం చేసుకునేందుకు ముందుగా నేనే ప్రయత్నించాను. ఆ తరువాత మేం మంచి స్నేహితులయ్యాం' అని చెబుతూ తన వరల్డ్ కప్ అనుభవాలను పంచుకుంది.



'టి-20లో దక్షిణాఫ్రికాతో మేం ఆడిన మ్యాచ్ నాకు ఓ మంచి అనుభూతిని పంచింది. ఒకసారి ఆట ప్రారంభానికి ముందు 'ఎవరితో మ్యాచ్' అని కొంతమంది మమ్మల్ని అడిగారు. దక్షిణాఫ్రికాతో అని చెప్పగానే 'అయితే ఇంటికెళ్లడానికి మీ బ్యాగులు సర్దుకోండి' అని హేళన చేశారు. ఆ మాటలకు మాలో పట్టుదల పెరిగింది. ఎలాగైనా ఆ మ్యాచ్ గెలవాలని గట్టిగా నిశ్చయించుకున్నాం. గెలిచాం. అప్పుడు హేళన చేసినవాళ్లే మమ్మల్ని గొప్పగా చూశారు. ఆటలో గెలుపోటములు సహజం. క్రీడా మైదానం మాకు పోరాటాన్ని నేర్పుతుంది. ఆ పోరాటంలో అందరూ గెలవాలనే పోటీపడతారు' అంటూ దక్షిణాఫ్రికాతో ఆడి గెలిచిన క్షణాలను గుర్తుచేసుకుంది.

ప్రస్తుతం షబ్నమ్ పదో తరగతి చదువుతోంది. స్కూలు యాజమాన్యం కూడా తనను ఎంతో ప్రోత్సహిస్తున్నారని చెబుతోంది. 'ఎంచుకున్న లక్ష్యం నెరవేరే వరకు శక్తివంచన లేకుండా కృషి చేయండి. గెలుపోటములు సహజం.. ఓటమి నుండి కూడా పాఠాలు నేర్చుకోండి' అంటూ యువతకు సందేశమిస్తోంది షబ్నమ్.

- జ్యోతిర్మయి



ఏప్రిల్ 14న 'శాకుంతలం'

సమంత నటించిన 'శాకుంతలం' సినిమా కొత్త విడుదల తేదీ వచ్చేసింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో ఏప్రిల్ 14న ఈ సినిమా రాబోతోందని మేకర్స్ తెలిపారు. గుణశేఖర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమాకు 'దిల్' రాజు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించారు. దేవ్ మోహన్ దుష్యంతుడిగా నటించిన ఈ చిత్రంలో టైటిల్ రోల్‌ను సమంత పోషించారు. అల్లు అర్జున్ కుమార్తె అర్హ బాల భరతుడి పాత్రలో నటించింది. మణిశర్మ స్వరరచన చేసిన ఈ చిత్రంలో మోహన్ బాబు, ప్రకాశ్ రాజ్, మధుబాల, గౌతమి, అదితి బాలన్, అనన్య నాగళ్ల, జిస్సు సేన్ గుప్తా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాను త్రీడీలోనూ విడుదల చేయబోతున్నారు.

అభిమాని కోరిక తీర్చిన రామ్‌చరణ్



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నాడు. క్యాన్సర్‌తో పోరాడుతున్న ఓ చిన్నారి చివరి కోరిక తీర్చాడు. తొమ్మిదేళ్ల మణి కుశాల్ చరణ్‌కు వీరాభిమాని. కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ప్రస్తుతం ఆ చిన్నారి హైదరాబాదులోని స్పర్శ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జీవితంలో ఒక్కసారైనా రామ్ చరణ్‌ను కలవాలని ఆ చిన్నారి తన కోరికను తల్లిదండ్రులకు తెలిపాడు. ఈ విషయాన్ని మేక్ ఏ విష్ ఫౌండేషన్ వారు రామ్‌చరణ్‌కు తెలియజేశారు. ఆ చిన్నారి పరిస్థితి తెలుసుకున్న చరణ్ స్పర్శ్ ఆసుపత్రికి వెళ్లాడు. చికిత్స పొందుతున్న మణి కుశాల్‌తో కాసేపు సరదాగా గడిపాడు. ఆ చిన్నారికి ఓ బహుమతిని ఇచ్చాడు. మణి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



కర్నూల్లో 'ఆర్‌సి 15'

మెగా అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న చిత్రం 'ఆర్‌సి15'. దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. గురువారం చార్మినార్ వద్ద కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్న చిత్రబృందం తాజాగా కర్నూలులో లాండ్ అయింది. కొండారెడ్డి బురుజు దగ్గర కీలక షెడ్యూల్ శుక్రవారం ప్రారంభమైంది. కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు సర్కారోడు అనే టైటిల్‌ను పరిశీలనలో ఉంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు.



'సలార్' సెట్‌లోకి శృతిహాసన్

'నాకు ఎంతో ఇష్టమైన సెట్' అంటూ 'సలార్' సెట్‌లోని ఫొటోను షేర్ చేసింది శృతిహాసన్. ఈ సినిమాలో శ్రుతి.. ఆద్య పాత్రను పోషిస్తోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో జగపతిబాబు, ఈశ్వరీరావు, శ్రియారెడ్డి తదితరులు కీలకపాత్రలో నటిస్తున్నారు. కమర్షియల్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఐదు భాషల్లో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో భారీ స్థాయిలో యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని గతంలో చిత్రబృందం చెప్పిన విషయం తెలిసిందే.



ఇలాంటి స్పందన ఊహించలేదు..

'మా సినిమా టీజర్‌కు ప్రేక్షకుల నుంచి ఈ విధమైన స్పందన వస్తుందని నేను అనుకోలేదు. నెగెటివ్ కామెంట్స్ విని ఎంతో బాధపడ్డా. ప్రేక్షకుల నుంచి వచ్చిన విమర్శలను చిత్రబృందం విని.. అందుకు అనుగుణంగా మార్పులు చేస్తోంది' అని కృతిసనన్ అన్నారు. ప్రభాస్, కతిసనన్ జంటగా నటించిన 'ఆదిపురుష్' చిత్ర టీజర్‌పై వచ్చిన స్పందనపై ఆమె తాజాగా స్పందించారు. గతేడాది విడుదల చేసిన ఈ సినిమా టీజర్‌పై సినీ ప్రియుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. భారీ బడ్జెట్‌తో ఓంరౌత్ దీన్ని తెరకెక్కించారు. ఇందులో ప్రభాస్.. రాముడిగా, కృతిసనన్.. సీత పాత్రలో నటించారు. రావణాసురుడి పాత్రను సైఫ్ అలీఖాన్ పోషించారు.

రోహిత్ రికార్డు శతకం

- అక్షర్ పటేల్, జడేజా అర్ధసెంచరీలు
- ఆస్ట్రేలియాపై 144 పరుగుల ఆధిక్యత

నాగ్‌పూర్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో భారతజట్టు పట్టు బిగిస్తోంది. కెప్టెన్ రోహిత్ శర్మ రికార్డు సెంచరీకి తోడు ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా అర్ధసెంచరీలతో రాణించడంతో భారత జట్టు ఇప్పటికే 144పరుగుల ఆధిక్యతను సంపాదించింది. ఓవర్ నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 77పరుగులతో శుక్రవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీమిండియా రెండోరోజు ఆట నిలిచే సమయానికి 7వికెట్లు నష్టపోయి 321పరుగులు చేసింది. రవీంద్ర జడేజా 66, అక్షర్ 52 పరుగులతో క్రీజులో ఉన్నారు. గాయం నుంచి కోలుకుని దాదాపు 6 నెలల తర్వాత బరిలో దిగిన జడేజా బౌలింగ్‌లో 5 వికెట్లు తీయడమే కాదు, బ్యాటింగ్‌లోనూ అర్ధసెంచరీతో కదం తొక్కాడు. 240 పరుగులకే 7వికెట్లు కోల్పోయిన దశలో జడేజా, అక్షర్ పటేల్ జోడీ 81పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఆదుకున్నారు. ఆస్ట్రేలియా బౌలర్లలో టాడ్ మర్ఫీకి ఐదు, కెప్టెన్ పాట్ కమిన్స్, నాథన్ లియాన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

కెప్టెన్‌గా రోహిత్ రికార్డు..

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఆస్ట్రేలియాపై సెంచరీ కొట్టి కెప్టెన్‌గా మూడు ఫార్మాట్‌లలో శతకాలు బాదిన తొలి భారత బ్యాటర్‌గా, ఓవరాల్‌గా నాల్గో కెప్టెన్‌గా రికార్డు నెలకొల్పాడు. టీమిండియా తరఫున కెప్టెన్‌గా మూడు ఫార్మాట్‌లలో సెంచరీ చేసిన ఏకైక కెప్టెన్‌గా చరిత్ర సృష్టించాడు. ఇక క్రికెట్ చరిత్రలో తిలక్‌రత్నే దిల్షాన్(శ్రీలంక), డుప్లెసిస్(దక్షిణాఫ్రికా), బాబర్ అజామ్(పాకిస్తాన్)లు మాత్రమే కెప్టెన్ హోదాలో మూడు ఫార్మాట్‌లలో సెంచరీలను చేశారు.

తాజాగా రోహిత్ వారి సరసన చేరాడు. ఆస్ట్రేలియా మొత్తం 171 బంతులను ఎదుర్కొన్న రోహిత్ 14ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో సెంచరీని పూర్తి చేశాడు. అలాగే 35ఏళ్ల రోహిత్ సెంచరీని పూర్తి చేసే క్రమంలో టెస్టుల్లోనూ 3వేల మార్క్‌ను అధిగమించాడు. అలాగే వ్యక్తిగతంగానూ టెస్టుల్లో 9వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

మర్ఫీకి ఐదు...

ఆసీస్ యువ స్పిన్నర్ మర్ఫీ ఆరంగేట్రం టెస్ట్‌లోనే ఐదు వికెట్లు తీసి రికార్డుపుటల్లోకెక్కాడు. స్పిన్‌కు అనుకూలించిన నాగ్‌పూర్ పిచ్‌పై మర్ఫీ(5/82) అద్భుత స్పెల్‌తో అలరించాడు. టీమిండియా బ్యాటర్స్ రాహుల్, అశ్విన్, పూజారా, కోహ్లీ, శ్రీకర్ భరత్ వికెట్లు తీశాడు. దీంతో తొలి మ్యాచ్‌లోనే 5వికెట్లు తీసిన ఆసీస్ స్పిన్నర్లలో నాలుగో ఆఫ్ స్పిన్నర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు.



స్కోర్ బోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 177ఆలౌట్

ఇండియా తొలి ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (బి)కమిన్స్ 120, కేఎల్ రాహుల్ (సి అండ్ బి) మర్ఫీ 20, అశ్విన్ (ఎల్‌బి)మర్ఫీ 23, పుజరా (సి)బోలండ్ (బి)మర్ఫీ 7, కోహ్లి (సి)క్యారీ (బి)మర్ఫీ 12 సూర్యకుమార్ (బి)ఎల్‌బి) 8, జడేజా (బ్యాటింగ్) 66, శ్రీకర్ భరత్ (ఎల్‌బి)మర్ఫీ 8, అక్షర్ పటేల్ (బ్యాటింగ్) 52, అదనం 5. (114ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 321పరుగులు. వికెట్ల పతనం: 1/75, 2/118, 3/135, 4/151. 5/166, 6/229, 7/240 బౌలింగ్: కమిన్స్ 18-2-74-1, బోలండ్ 17-4-34-0, లియాన్ 37-10-98-1, మర్ఫీ 36-9-82-5, లబూషేన్ 5-0-24-0, రెన్‌షా 1-0-7-0



మంధానకు గాయం

పాకిస్తాన్‌తో మ్యాచ్‌కు దూరం?

కేప్‌టౌన్: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌కు ముందు భారత జట్టుకు గటి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన గాయపడింది. ఆస్ట్రేలియాతో సోమవారం జరిగిన తొలి ప్రాక్టీస్ మ్యాచ్ సందర్భంగా స్మృతి ఎడమచేతి మధ్యవేలికి గాయమైనట్లు సమాచారం. దీంతో ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో ప్రాక్టీస్ దూరంగా ఉంది. ఈ విషయాన్ని బిసిసిఐ అధికారికంగా ప్రకటించకపోయినా.. అదే నిజమైతే ఆమె పాకిస్తాన్‌తో జరిగే తొలి మ్యాచ్‌కు దూరమైనట్లే. గ్రూప్-బిలో భారతజట్టుతోపాటు ఇంగ్లండ్, పాకిస్తాన్, వెస్టిండీస్, ఐర్లాండ్ జట్లు ఉన్న సంగతి తెలిసిందే. శుక్రవారం రాత్రి దక్షిణాఫ్రికా-శ్రీలంక జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ ప్రారంభమైంది.

భారీ ఆధిక్యత దిశగా బెంగాల్

రంజీట్రోఫీ సెమీఫైనల్స్



ఆకాశ్ దీప్‌కు 5వికెట్లు

ఇండోర్: రంజీట్రోఫీ సెమీఫైనల్లో బెంగాల్ జట్టు భారీ ఆధిక్యత దిశగా దూసుకెళ్లోంది. మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న సెమీస్‌లో బెంగాల్ జట్టు మధ్యప్రదేశ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 170పరుగులకే కట్టడి చేసింది. ఆకాశ్ దీప్‌కు ఐదు, షాబాజ్ అహ్మద్‌కు రెండు వికెట్లు దక్కాయి. దీంతో మధ్యప్రదేశ్‌ను ఫాలోఆన్ ఆడించాల్సి ఉన్నా.. రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన బెంగాల్ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 2వికెట్లు నష్టపోయి 59పరుగులు చేసింది. దీంతో బెంగాల్ జట్టు ఇప్పటికే 327పరుగుల ఆధిక్యతలోకి నిలిచింది. కరణ్ లాల్(19), అభిమన్యు ఈశ్వరన్(17) ఔట్ కాగా.. సుదీప్ కుమార్(12), మజుందార్(9) క్రీజ్‌లో ఉన్నారు.

బెంగళూరు వేదికగా జరుగుతున్న రెండో సెమీస్‌లో సౌరాష్ట్ర జట్టు పోరాడుతోంది. ఓవర్‌నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 76పరుగులతో శుక్రవారం ఆటను కొనసాగించిన సౌరాష్ట్ర జట్టును షెల్డన్ జాక్సన్(160), కెప్టెన్ అర్పిత్ వసవాడ(112నాటౌట్) సెంచరీలతో ఆదుకున్నారు. దీంతో సౌరాష్ట్ర జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్లు నష్టపోయి 364పరుగులు చేసింది. కావెరప్పకు రెండు, కౌశిక్, గౌతమ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68